విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

టీవీ రిపోర్టర్లు కావలెను
A.P VISION TV
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | గురువారం 10-07-2025 | సంపుటి : 11 | సంచిక : 161 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ.. కీలక నిర్ణయాలు

అమరావతి, జులై 09: సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్ల సమావేశంలో వివరించారు. రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, అధికారుల భవనాలను సత్వరం పూర్తి చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల నివాస భవనాలు పూర్తి చేయడం కోసం నిధుల మంజూరుకు సైతం ఈ కేబినెట్‌లో ఆమోదం తెలిపినట్లు చెప్పారు. భవనాలు మిగిలిన పనుల పూర్తి చేసేందుకు రూ. 524.7 కోట్లు నిధుల మంజూరుకు పరిపాలన పరమైన ఆమోదం చెప్పినట్లు పేర్కొన్నారు. అమరావతిలో 6 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు 33.49 ఎకరాలు భూములు కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామన్నారు. అమరావతిలో కొత్తగా 7 సంస్థలకు 32. 4 ఎకరాలు భూమి కేటాయిస్తూ ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. అలాగే గెయిల్, అంబికా సంస్థలకు అమరావతిలో కేటాయించిన భూమిని రద్దు ప్రతిపాదనకు ఆమోదం తెలిపామన్నారు. ఇక కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీ ముందు ఇసుక క్వారీయింగ్ కోసం రూ. 250.2 కోట్లు పరిపాలన పరంగా ఆమోదించామని చెప్పారు. ఎన్జీటీ, సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి క్వారీయింగ్‌ను ఏపీ సీఆర్డీఏ నిర్వహణకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. జల వనరుల శాఖలో గత ప్రభుత్వం పక్కన పెట్టిన 71 పనులను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించిందన్నారు. కుప్పం, దగదర్తి, శ్రీకాకుళంలో విమానాశ్రయాల అభివృద్ధికి రూ. 1000



కోట్లు హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు ఆమోదం తెలిపామన్నారు. ఎయిర్‌పోర్టులు లీజుకు ఇవ్వడం.. పీపీపీ ద్వారా వచ్చిన ఆదాయంతో ఈ అప్పులు చెల్లించాలని నిర్ణయించామని చెప్పారు. హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులుకు జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనను ఆమోదించామన్నారు. రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్‌ను ఏర్పాటు చేసేందుకు.. అలాగే ఈ మిషన్ కింద రూ. 10 వేల కోట్ల రుణం ద్వారా నిధుల సమీకరించే ప్రతిపాదనకు సైతం ఆమోదం తెలిపినట్లు వివరించారు. సరకు రవాణా వాహనాలపై గత వైసీపీ ప్రభుత్వం రూ. 20 వేల వరకు పెంచిన గ్రీన్ టాక్స్‌ను తగ్గించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ గ్రీన్ టాక్స్‌ను రూ. 1500-3000 వరకు తగ్గిస్తూ రవాణాశాఖ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీ కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేసే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసిందని చెప్పారు. రాష్ట్రంలో స్పేస్ టెక్నాలజీ అభివృద్ధి కోసం ప్రకటించిన పాలసీకి పచ్చ జెండా ఊపినట్లు తెలిపారు. రామాయపట్నంలో భూ సేకరణ కోసం ఐదు టీమ్‌లను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాజధాని అమరావతిలో వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 1,575 పింఛన్లను పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. మార్క్‌ఫెడ్ తీసుకున్నరూ. 6, 700 కోట్లు రుణానికి అదనంగా రూ. 1000 కోట్లు రుణం పొందేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. 6.5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కొనుగోలు చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. కిలోకు రూ. 4 చొప్పున రూ. 260 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదించిందన్నారు. రైతులకు ధాన్యం సేకరణ నగదు చెల్లించేందుకు రూ. 672 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపామన్నారు. గురువారం రైతుల ఖాతాలో ధాన్యం కొనుగోలు నగదు జమ చేయాలని నిర్ణయించిందని చెప్పారు. రెండో విడత భూ సమీకరణపై ప్రజలతో పలుమార్లు సంప్రదించాలని కేబినెట్లో నిర్ణయించినట్లు వివరించారు. భూ సమీకరణ చేసేందుకు అవసరాన్ని, పరిస్థితిని రైతులను కలిసి వివరించాలని నిర్ణయించామన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేసి.. వారు ఒప్పుకున్నాకే భూ సమీకరణ చేయాలని తమకు సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకుండా ప్రతిపక్షం చేస్తోన్న కుట్రలు తిప్పి కొట్టాల్సిన బాధ్యత మంత్రులుగా తమపై ఉందని సీఎం ఈ సందర్భంగా తమకు సూచించారని చెప్పారు. ఈ కుట్రలను సమర్థవంతంగా తిప్పి కొట్టాలని ఈ కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు తమకు స్పష్టంగా ఆదేశించారని మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

# వరదనీటి ఉపయోగం కోసమే పట్టిసీమ

**వృధా గోదావరి జలాల వినియోగంతో సస్యశ్యామలం**
**రాష్ట్ర ఆర్థిక స్థితిని గాడిలో పెడుతున్న సిఎం చంద్రబాబు**
**గోదావరి సంగమం వద్ద జలహారతి ఇచ్చిన మంత్రినిమ్మల**

విజయవాడ,జూలై9: కృష్ణా- గోదావరి జలాల పవిత్ర సంఘమం దగ్గర రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జలహారతి ఇచ్చారు. వెంటిలేటర్ మీద ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఐసీయూ లోకి తీసుకొచ్చి కోలుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ మెరుగైన పాలన అందిస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం కూడి కాలువ ద్వారా కృష్ణా నదిలోకి వచ్చిన గోదావరి జలాలకు ఇబ్రహీం పట్నం పవిత్ర సంఘమం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం లో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు. గోదావరి నదిలో ప్రతి సంవత్సరం 3 వేల టీఎంసీలు నీరు వృథాగా సముద్రంలోకి కలసిపోతుంది. ఆ వరద నీటిని పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయ్యేలోగా ఆ ఫలాలు కొంతమేర అయినా అందించాలనే ఆలోచనలో భాగంగానే నాడు చంద్రబాబు నాయుడు పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఐతే అప్పుడు 2014-19 లో ప్రతిపక్షంలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీలో పట్టిసీమ కాదు, ఇది ఒట్టి సీమ అని ఏద్దేవా చేశారు అని అన్నారు. అలాంటి పట్టిసీమే కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉపయోగపడిందని అన్నారు. పట్టిసీమ నుండి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఉపయోగించుకోవడం ద్వారా, కృష్ణా నది ఎగువన శ్రీశైలం బ్యాక్ వాటర్ ను రాయలసీమ కు ఉపయోగించుకోవడం జరుగుతోందని తెలిపారు. గతేడాది రాయలసీమ లో ఏ రిజర్వాయర్‌లో చూసినా 90 నుండి 95 శాతం నీటి సామర్థంతో నీటిని నిల్వ చేయగలిగాం



అని ఇది చంద్రబాబు గారి ముందు చూపు,వాటర్ మానజ్మెంట్ ద్వారానే సాధ్యమైందన్నారు. పట్టిసీమ ద్వారా 2014 -19 లో 263 టీ-ఎంసీ ల గోదావరి జలాలు కృష్ణా నదిలోకి ఎత్తిపోశాము. ఇది శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం కంటే కూడా ఎక్కువ. అదేవిధంగా ఇప్పటివరకు 428 టీ-ఎంసీ ల నీటిని తరలించాం.

# రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ కేబినెట్

అమరావతి, జులై 09: సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రైతాంగానికి కేబినెట్ తీపి కబురు చెప్పింది. ధాన్యం పాత బకాయిలు రూ. 1000 కోట్లలో రూ. 672 కోట్ల నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నగదును 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ నిధులు రైతుల ఖాతాల్లో వేసే బాధ్యతను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి ప్రభుత్వం అప్పగించింది. అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజా పంపిణీ అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థ ద్వారా




గత రబీ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించింది. ఆ క్రమంలో మద్దతు ధరను రైతుల ఖాతాల్లో జమ చేయడంలో జాప్యం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రూ. 1,000 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతిస్తూ జులై 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు వచ్చిన వెంటనే ధాన్యం బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసేలా పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. దీంతో ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో ఈ ధాన్యం బకాయిల సొమ్ము జమ కానుందని తెలుస్తుంది. మరోవైపు ఈ రోజు ఉదయం రాజధాని అమరావతిలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది.

**మంత్రి నాదెండ్ల ఆదేశం..** ఇదే అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ. 672కోట్లు విడుదలకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 32 వేల మంది రైతులకు ఈ నిధులు మంజూరు ద్వారా లబ్ది చేకూరుతోందన్నారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో పెండింగ్ బకాయిలు జమ చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు.

# మామిడి రైతులను పట్టించుకోని ప్రభుత్వం

**రైతులు రాకుండా ఆంక్షలు విధించడమేంటి**
**బంగారుపాళ్యం పర్యటనలో మండిపడ్డ జగన్**


చిత్తూరు,జూలై9: మామిడి రైతులను నిరంకుశంగా నియంత్రించారని.. మామిడి రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ సీఎం జగన్ అన్నారు. చిత్తూరు పర్యటనలో భాగంగా బంగారపాళ్యంలో ఆయన



మాట్లాడారు. ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. జగన్ వస్తున్నాడని తెలిసి, ఇక్కడ 2 వేల మంది పోలీసులను మొహరించి, రైతులను రానివ్వకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైతులు ఇక్కడికి రాకుండా బెదిరించారని.. చివరకు టూవీలర్లపై వచ్చిన వారిని కూడా అడ్డుకున్నారన్నారు. ఇక్కడికి కేవలం 500 మంది మాత్రమే రావాలని ఎందుకు అన్నారు. ఎందుకీ ఆంక్షలు అని ప్రశ్నించారు. అయినా ఇక్కడికి వేల మంది రైతులు వచ్చి, వారి ఆవేదన చెప్పుకున్నారని.. ఏ పంటకు కనీస గిట్టుబాటు- ధర లేదన్నారు. వరికి కూడా ధర లేదని.. కనీసం రూ. 300కు తక్కువకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వరి, పెసర, జొన్న.. చివరకు మామిడి రైతులకు కూడా కనీస గిట్టుబాటు ధర రావడం లేదని.. ఒక్క మన రాష్ట్రంలో తప్ప, వేరే రాష్ట్రంలో అయినా కిలో మామిడి రూ. 2కి దొరుకుతుందా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి నా సూటి ప్రశ్న. ఎందుకు ధర లేదు? అని జగన్ ప్రశ్నించారు.

# ఆర్టికల్ 326 ప్రకారమే ఓటర్ల జాబితా రివిజన్: ఈసీ

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్నికల జాబితా రివిజన్ వివాదం ముదురుతుండటంతో ఎన్నికల కమిషన్ మరోసారి స్పష్టత ఇచ్చింది. బిహార్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రత్యేక విస్తృత సమీక్ష చట్టపరంగానే జరుగుతోందని తెలిపింది. తమ వాదనకు బలం చేకూరేలా రాజ్యాంగంలోని 326వ నిబంధనకు చెందిన స్నాప్‌షాట్‌ను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ లిస్ట్‌ను తారుమారు చేసే ప్రయత్నంలో భాగంగానే ప్రత్యేక విస్తృత సమీక్షకు ఈసీ ఆదేశాలిచ్చిందంటూ 'ఇండియా' కూటమి విమర్శలు ఉధృతం చేస్తున్న నేపథ్యంలో ఈసీ తాజా వివరణ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ అధికారాన్ని ఎన్నికల కమిషన్ కలిగి ఉంటుందని రాజ్యాంగంలోని 324వ అధికరణ చెబుతోంది. 326వ అధికరణ ఓటర్ల రివిజన్ ఎక్సర్‌సైజ్‌తో అడల్ట్




ఇండియన్ సిటిజన్లకు ఓటు హక్కును తప్పనిసరి చేస్తోంది. రాజ్యాంగంలోని ఈ నిబంధనలను తు.చ. తప్పకుండా తాము పాటిస్తున్నట్టు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. బిహార్‌లో ప్రత్యేక రివిజన్ రెండో దశాబ్దాల క్రితం 2003లో జరిగిందని ఈసీ తెలిపింది. ర్యాపిడ్ అర్బనైజేషన్, పెద్దఎత్తున వలసలు, తొలిసారి ఓటువేసే వారి సంఖ్య పెరగడం, మరణాలను రిపోర్ట్ చేయకపోవడం వంటివి కూడా ఓటర్ రివిజన్‌కు కారణాలని పేర్కొంది. ఎన్నికల కమిషన్ తాజాగా నిబంధనలను సడలిస్తూ కీలక నిర్ణయం సైతం తీసుకుంది. ఓటర్లు తమ దరఖస్తులను సమర్పిస్తే చాలని, ప్రస్తుతం సపోర్టింగ్ డాక్యుమెంట్లు అవసరం లేదని ప్రకటించింది. తద్వారా ఓటర్లకు ఉపశమనం కలిగించింది. బిహార్‌లో ఎన్నికల జాబితా రివిజన్ ప్రక్రియ జూన్ 25న ప్రారంభమైంది. పబ్లిక్ స్క్రూటినీ, కరెక్షన్ల కోసం డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను ఆగస్టు 1న పబ్లిష్ చేసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదలవుతుంది. అక్టోబర్-నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

# యూరియాపై సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి.. స్పందించిన కేంద్రమంత్రి జేపీ నడ్డా

ఢిల్లీ: ఖరీఫ్ సీజన్‌లో తమ రాష్ట్రంలో యూరియాకు గరిష్టంగా డిమాండ్ ఉంటుందంటూ కేంద్రమంత్రి జేపీ నడ్డాకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సరిపడా యూరియా తెలంగాణకు కేంద్రప్రభుత్వం ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారు. అయితే సీఎం విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతుల డిమాండ్‌ను నెరవేర్చే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు కేంద్రమంత్రి జేపీ నడ్డా. అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా ఉండేలా చూసుకోవాలని ఎరువుల శాఖ అధికారులను ఆదేశించారు. ఢిల్లీలో జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. రసాయన ఎరువులు అధికంగా వాడటంతో భూమిలోని సారం తగ్గిపోతోందని ముఖ్యమంత్రికి కేంద్రమంత్రి జేపీ నడ్డా సూచించారు. 2023-24 రబీతో పోలిస్తే 2024- 25లో 21శాతం అదనంగా యూరియా అమ్మకాలు జరిగాయని కేంద్రమంత్రి వెల్లడించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటివరకు 12.4శాతం అదనపు వినియోగం జరిగిందని చెప్పుకొచ్చారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను దారి మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఎరువులు, సేంద్రీయ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఖఓ ఖఖీంఔంఓ పథకం గురించి తెలంగాణ అధికారులకు కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రంజిత్ కుమార్ మిశ్రా వివరించారు.

# సంపాదకీయం


గురువారం 10-07-2025

## ప్రాజెక్టు విష్ణుతో ఆర్థిక స్వావలంబన

ఆర్థిక వ్యవస్థలో జర్మనీ దేశాన్ని పక్కన పెట్టాం. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. భవిష్యత్ కాలంలో చైనాను అధిగమించబోతున్నాం. అమెరికాకు దగ్గరగా వెళ్లబోతున్నాం.. ఆర్థికంగా ఎదగడం మాత్రమే కాదు.. రక్షణ పరంగా కూడా అంతే స్థాయిలో వృద్ధిని సాధించబోతున్నాం. ఇదేదో అడ్డగోలుగా చెబుతున్న మాట కాదు. సరదాగా చేస్తున్న వ్యాఖ్య అంతకన్నా కాదు. ఇటీవల పాకిస్తాన్ పై ఆపరేషన్ సిందూర్ తర్వాత మన సైనిక సామర్థ్యం.. మన ఆయుధ సామర్థ్యం.. ప్రపంచానికి తెలిసింది. ముఖ్యంగా యుద్ధ విమానాలను వాడటంలో మనం ఉపయోగిస్తున్న సాంకేతికత ప్రపంచానికి సరికొత్తగా కనిపించింది. అయితే దీనిని ఇక్కడితోనే ఆపివేయాలని భారత ప్రభుత్వం అనుకోవడం లేదు. ఈ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థను భారతదేశం నిర్మించుకుంటున్నది. ఇప్పటికే డిఆర్డిఓ అత్యంత ఆధునికమైన ఆయుధాలను తయారు చేస్తున్నది. వచ్చే ఐదు సంవత్సరాలలో వివిధ రకాల 12 హైపర్ సోనిక్ యుద్ధ క్షిపణులు సిద్ధమవుతున్నాయి. ఇవి దాడి చేయడం మాత్రమే కాదు.. శత్రు దేశాల రక్షణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్రాజెక్టు విష్ణు లో భాగంగా డిఆర్డిఓ ఈ మిషన్ చేపడుతోంది.. డిఆర్డిఓ చేపడుతున్న మిషన్ లో హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్, హైపర్ సోనిక్ క్రూజ్ మిస్సైల్స్, హైపర్ సోనిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. దాడిలో అత్యంత వేగవంతమైన సామర్థ్యం.. అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానం వీటిలో ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా శత్రువులను అత్యంత బలంగా ఎదుర్కోవడం.. వెంటనే తుద ముట్టించడం వీటి లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు.సరిగ్గా ఏడాది క్రితం డిఆర్డిఓ హైపర్ సోనిక్ మిస్సైల్ పరీక్షను అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా దేశ స్క్రామ్ జెట్ ఇంజన్ అభివృద్ధిలో ఇది కీలకమైన రాయిగా నిలిచింది.. అంతేకాదు ఈ వ్యవస్థలను అభివృద్ధి చేసి చైనా, రష్యా, అమెరికా స్థాయిలో భారత్ నిలిచింది. లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ కెపాసిటీ ఉన్న మోస్ట్ పవర్ఫుల్ కంట్రీస్ లో మన దేశం ఒకటిగా నిలిచింది. ధ్వని కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణించే కెపాసిటీ ఉన్న ఆయుధాలను హైపర్ సోనిక్ అని పిలుస్తుంటారు. ఇలాంటి క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్ద లేదు. అయితే ఇటువంటి అత్యాధునిక హైపర్ సోనిక్ వెపన్స్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. వీటిని ఆర్మీ, నేవి, వాయు సేన కోసం డెవలప్ చేస్తోంది.ఇందులో ఫస్ట్ టైం ఎక్స్టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. స్క్రామ్ జెట్ ఇంజన్ తో మాక్- 8 స్పీడ్ ను రీచ్ అయ్యే విధంగా దీనిని డెవలప్ చేస్తున్నారు. ఇది 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న టార్గెట్ లను చేజ్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు 2030 కల్లా వీటిని మన ఆర్మీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఆయుధాలు మన ఆర్మీకి ఐదు సంవత్సరాల కాలంలో అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ కూడా మన దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి. అప్పుడు శత్రు దేశాలు మన మీద దాడి చేయాలంటే ఆలోచిస్తాయి. అంతేకాదు బలమైన దేశాల కంటే మనమే ముందు వరుసలో ఉంటాం. అన్నిటికంటే ముఖ్యంగా రక్షణ వ్యవస్థలో అమెరికాతో సమానంగా ఉంటాం. భారత్ ఒకప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉండేది. కానీ, ఇప్పుడు ఎగుమతిచేసే స్థాయికి ఎదిగింది. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక రక్షణ ఎగుమతులు గణనీయంగా పుంజుకున్నాయి. గత దశాబ్దంలో దాని రక్షణ ఎగుమతులు 34 రెట్లు పెరిగి, 2024?25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి. పాకిస్తాన్, చైనా, టర్కీల భౌగోళిక రాజకీయ ఒత్తిడి, అమెరికా ఆయుధ సరఫరా ఖాళీలు, ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో రక్షణ ఒప్పందాలపై దృష్టి ఈ విజయానికి దోహదపడ్డాయి.భారత రక్షణ ఎగుమతుల విలువ 2013?14 నాటికి రూ.686 కోట్లు ఉండగా, 2024?25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి, ఇది 34 రెట్ల వృద్ధిని సూచిస్తుంది. 2014 నుంచి అమలులో ఉన్న మేడిన్ ఇండియా కార్యక్రమం దేశీ ఆయుధాలను, డ్రోన్‌లను సమర్థవంతంగా గుర్తించే సామర్థ్యం, ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యూహాలను నిరోధించే లక్షణం పెంచింది. ఈ రాడార్‌ను సుఖోయ్?30ఎంకేఐ, రఫేల్, తేజస్ వంటి యుద్ధవిమానాలతో అనుసంధానం చేసే అవకాశం ఉంది. అజర్‌బైజాన్?అర్మేనియా మధ్య నాగోర్నో?కరాబాఖ్ సంఘర్షణలో అజర్‌బైజాన్‌కు టర్కీ, పాకిస్తాన్ మద్దతు ఇవ్వడంతో, భారత్ అర్మేనియాకు ఆకాశ్?1ఎస్, పినాకా రాకెట్ లాంచర్లు, స్వాతి రాడార్లు వంటి ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఈ సహకారం అజర్‌బైజాన్ యొక్క సైనిక ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, టర్కీ, పాకిస్తాన్‌లపై పరోక్షంగా ఒత్తిడి కలిగిస్తోంది. ఇదే సమయంలో 2025లో మోదీ సైప్రస్ సందర్శన, టర్కీ నియంత్రిత ఉత్తర సైప్రస్‌కు వ్యతిరేకంగా బలమైన దౌత్య సందేశాన్ని ఇచ్చింది. సైప్రస్ భారత్ యొక్క భౌగోళిక రాజకీయ వ్యూహంలో మధ్యధరా, యూరోపియన్ మార్కెట్లకు గేట్‌వేగా మారుతోంది.చైనా?తైవాన్ సంఘర్షణ నేపథ్యంలో, భారత్ తైవాన్‌తో సంబంధాలను బలోపేతం చేస్తోంది. అమెరికా మద్దతుతో, భారత్ తైవాన్‌కు అండగా నిలవడం ద్వారా చైనాకు వ్యూహాత్మక ఒత్తిడి కల్పిస్తోంది, ఇది ఇండో?పసిఫిక్‌లో చైనా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. పాకిస్తాన్, చైనా, టర్కీల శత్రుత్వం, అమెరికా ఎగుమతి ఖాళీలు భారత్‌ను స్వదేశీ రక్షణ తయారీ, ఎగుమతులపై దృష్టి పెట్టేలా చేశాయి. మోదీ విదేశీ పర్యటనలు గ్రీస్, అర్మేనియా, సైప్రస్, తైవాన్‌లతో రక్షణ ఒప్పందాల ద్వారా భారత్ యొక్క భౌగోళిక రాజకీయ ప్రభావాన్ని పెంచాయి.

# దారి తప్పుతున్న బండి

హైదరాబాద్, జూలై 9, మీడియాకు, రాజకీయ నాయకులకు ఉన్న అవినాభావ సంబంధం ఈనాటిది కాదు.. వెనుకటి కాలంలో నచ్చిన ముఖ్యమంత్రి ఉండడానికి తెలుగు నాట ఓ మీడియా అధినేత ఏకపక్ష రాతలు రాశాడు. మొదట్లో ఆ ముఖ్యమంత్రికి ఆ మీడియా అధినేత కు మధ్య సంబంధం బాగానే ఉండేది. ఆ సంబంధం చెడిపోయిన తర్వాత ఆ మీడియా అధినేత ఆ ముఖ్యమంత్రిపై తీవ్రతి తీవ్రమైన స్థాయిలో వార్తలు రాయించాడు. కార్టూన్లు గీయించాడు. ఈ ఉదంతం తెలుగు రాష్ట్రంలోనే కాదు.. జాతీయస్థాయిలోనూ అప్పట్లో చర్చకు దారితీసిందిఆ తర్వాత ఆ మీడియా అధినేత మరో ముఖ్యమంత్రికి దగ్గర వ్యక్తిగా మారిపోయాడు. తన సంస్థ ప్రయోజనాలకు అనుగుణంగా వార్తలు రాయడం మొదలుపెట్టాడు. నచ్చని వాళ్ళ మీద విష ప్రచారం చేశాడు. అతను మాత్రమే కాదు మీడియాలో ఉండే ఏ వ్యక్తయినా సరే ఇలాంటి విధానాలనే అనుసరిస్తారు. అది కేవలం తెలుగు రాష్ట్రాలే కాదు.. జాతీయస్థాయిలోనూ ఇదే దరిద్రం కొనసాగుతోంది. గత చరిత్ర తీసుకున్నా.. ఇప్పటి వర్తమానాన్ని పరిశీలించినా మీడియా అధినేతలు ఎప్పుడు కూడా వారి ప్రయోజనాలు మాత్రమే చూసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీకి మాత్రమే డప్పు కొడతారు.ఇక ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో కూటమి, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. ఈ పార్టీలకు డప్పులు కొట్టే మీడియా సంస్థలు చాలానే ఉన్నాయి. ఒకప్పుడు ప్రతిపక్షానికి అంతగా వాయిస్ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలు కూడా ఒకప్పుడు అధికారంలో ఉన్నవే.



అందువల్లే భారీగా డబ్బులు వెనకేసుకుని న్యూస్ ఛానల్స్ రన్ చేస్తున్నాయి. సో మీడియా అనేది ఇప్పుడు రూలింగ్, నాన్ రూలింగ్ కేటగిరిగా మారిపోయింది. సహజంగానే ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అధికారంలోకి రావాలి అనుకుంటుంది. అందుకోసం ఏవైనా చేస్తుంది. ఇక రూలింగ్ లో ఉన్న పార్టీ వచ్చే సారి కూడా అధికారాన్ని దక్కించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంది. అంటే నిత్యం అటు రూలింగ్.. ఇటు నాన్ రూలింగ్ పార్టీల మీడియా సంస్థలకు చేతినిండా పని ఉంటుంది. ఒకరి మీద ఒకరు విమర్శలు చేసుకోవడం.. ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం ఇదే పని.ఇటీవల ఓ న్యూస్ ఛానల్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మీద పనికిమాలిన తంబ్ నైల్స్ పెట్టింది. అవి కాస్త సంచలనంగా మారాయి. దీంతో భారత రాష్ట్ర సమితి నాయకులు స్పందించారు. ఆ న్యూస్ ఛానల్ కార్యాలయం మీద దాడి చేశారు. ఆ దాడి అనంతరం భారత రాష్ట్ర సమితి నాయకులు రెచ్చిపోయి.. మీడియాకు ప్రాంతీయ భేదాన్ని ఆపాదించారు. సీమాంధ్ర మీడియా అంటూ విమర్శించారు. ఎప్పుడైతే సీమాంధ్ర మీడియా అంటూ గులాబీ నాయకులు వ్యాఖ్యలు చేశారో.. ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణ స్పందించారు. ఆయన ఒక అడుగు ముందుకేసి తెలంగాణ కెసిఆర్ జాగీర్ కాదు అంటూ మండిపడ్డారు. తన సంపాదకీయంలో చాలా ఘాటు పదాలు వాడారు. దీంతో వివాదం మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థల కార్యాలయాల ఎదుట ప్రభుత్వం పోలీసులతో భద్రత కల్పించింది. ఆ దృశ్యాలను ఉదయం నుంచి గులాబీ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో తెగ తిప్పుతున్నారు. దెబ్బకు పోలీసుల పహారాతో కార్యాలయాలు నిర్వహిస్తున్నారని ఎగతాళి చేశారు. ఇక ఇదే క్రమంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు స్పందించారు. ఆంధ్రజ్యోతి సంస్థలపై గులాబీ పార్టీ కార్యకర్తలు దాడులు చేస్తే తాము టీ న్యూస్ పై దాడులకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు.రామచంద్రరావు మాటలను ఉటంకిస్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా తీవ్రంగా స్పందించారు. ఒకవేళ ఆర్కే నిర్వహిస్తున్న మీడియా సంస్థల మీద దాడులు చేస్తే.. కచ్చితంగా తెలంగాణ భవన్ మీద తాము దాడులు చేస్తామని హెచ్చరించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల పట్ల గులాబీ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. ఆ ఛానల్, పేపర్ ను నెత్తిన పెట్టుకొని తిరుగు బండన్నా.. నువ్వు కేంద్ర మంత్రివా? ఆ సంస్థలో ఉద్యోగివా? లేక రాధాకృష్ణకు దగ్గరి బంధువువా? అంటూ విమర్శిస్తున్నారు.

# భలే చౌక బేరం...సగానికి కార్లు...

న్యూఢిల్లీ, జూలై 9, ఢిల్లీలో పాత పెట్రోల్, డీజిల్ వాహనాలపై ప్రభుత్వం పెట్టిన ఆంక్షల వల్ల సెకండ్ హ్యాండ్ కార్ల ధరలు భారీగా పడిపోయాయి. గత కొద్ది రోజుల్లో పాత కార్ల ధరలు 40 నుండి 50 శాతం వరకు తగ్గాయి. ఢిల్లీ ప్రభుత్వ నియమాలు, కోర్టు ఆదేశాల కారణంగా పాత వాహనాల అమ్మకాలపై చాలా ప్రభావం పడిందని అక్కడి వ్యాపారులు అంటున్నారు. రాజధానిలో సుమారు 60 లక్షల పాత వాహనాలు ఈ ఆంక్షల వల్ల తీవ్రంగా ప్రభావితం అయ్యాయని చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ అనే పరిశ్రమ సంఘం పేర్కొంది. ఢిల్లీలో జూలై 1 నుంచి పాత వాహనాలపై నిషేధం అమల్లోకి రావాలి. అయితే, ఎయిర్ క్వాలిటీ మేనేజ్?మెంట్ కమిషన్, పర్యావరణ మంత్రి ఇచ్చిన లేఖ తర్వాత ఈ నిషేధాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఎందుకంటే ఎండ్ ఆఫ్ లైఫ్ వాహనాలపై నిషేధం పూర్తిగా రద్దు కాలేదు. ఈ నిర్ణయం తర్వాత కూడా సీజ్ చేసిన వాహనాల భవిష్యత్తుపై గందరగోళం కొనసాగుతోంది. ప్రభుత్వం కొద్దిగా ఊరటనిచ్చినా పాత వాహనాల యజమానులు, వ్యాపారులకు పరిస్థితి ఇంకా స్పష్టంగా లేదు.ఢిల్లీలో నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లు నిండిన



పెట్రోల్ కార్లను, 10 ఏళ్లు నిండిన డీజిల్ కార్లను నడపడానికి అనుమతి లేదు. కోర్టు ఆదేశాల తర్వాత ఢిల్లీ ప్రభుత్వం ఈ పాత వాహనాలకు ఇంధనం పోయడంపై కూడా నిషేధం విధించింది. అంటే, జూలై 1 నుంచి ఈ వాహనాలు రోడ్లపైకి రాకూడదు. అయితే, వ్యాపారులు, సామాన్య ప్రజలు దీనిపై నిరసన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఎయిర్ క్వాలిటీ మేనేజ్?మెంట్ కమిషన్ ను ఈ ఆంక్షలను తొలగించమని కోరింది. అయినప్పటికీ వ్యాపారులు ఇప్పటికీ ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు తమ పాత కార్లను కేవలం పావు వంతు ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని అక్కడ వ్యాపారులు చెబుతున్నారు. ఉదాహరణకు, గతంలో రూ.6-7 లక్షలకు అమ్ముడైన లగ్జరీ సెకండ్ హ్యాండ్ కార్లు ఇప్పుడు రూ.4-5 లక్షలకు కూడా అమ్ముడుపోవడం కష్టంగా మారిందని తెలిపారు.పాత వాహనాలను సాధారణంగా పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి ఇతర రాష్ట్రాలకు అమ్ముతుంటారు. కానీ ఇప్పుడు ఇతర రాష్ట్రాల కొనుగోలుదారులు కూడా బేరం ఆడుతున్నారు. ఎందుకంటే వారికి ఢిల్లీలో ఉన్న పరిస్థితి గురించి తెలుసు. కరమ్ బాగ్, ప్రీత్ విహార్, పీతంపుర, మోతీ నగర్ వంటి ప్రాంతాల్లో 1000 మందికి పైగా వ్యాపారులు సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యాపారులకు భారీ నష్టాలు వస్తున్నాయి. వ్యాపారులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఢిల్లీ నుంచి పాత వాహనాలను వేరే రాష్ట్రానికి ట్రాన్స్ఫర్ చేయాలంటే ఈ సర్టిఫికేట్ తప్పనిసరి. గతంలో ఈ ప్రక్రియ సులువుగా ఉండేది.. కానీ ఇప్పుడు ఆలస్యం, టెక్నికల్ సమస్యలు పెరిగాయి. మొత్తం మీద, పాత వాహనాలపై పెట్టిన ఆంక్షలు ఢిల్లీ సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్‌ను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి.

# ఆ రోడ్డుకు విముక్తి కలిపించిన హైడ్రా

హైదరాబాద్, జూలై 9, దారికి అడ్డుగా ఉన్న ఓ పెద్ద గోడ వేలాది ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఆ గోడ వల్ల వేల మంది ప్రజలు నిత్యం 5 కిలోమీటర్లు ఎక్కువ ప్రయాణించిన పరిస్థితి నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్ రోడ్డు మీదుగా ప్రగతినగర్ కు చేరుకునేందుకు ప్రజలు నానా తంటాలు పడేవారు. మరి కొంత మంది తమది గేటెడ్ కమ్యూనిటీ తమ కాలనీలో నుంచి రాకపోకలు బంద్ అంని అడ్డుగోడలు కట్టేవారు ఉన్నారు. ఇదంతా మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట, బాచుపల్లి గ్రామాల మధ్య నెలకొన్న వివాదం. దాదాపు 25,000 మంది ప్రజల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న గోడను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఇటీవల కూల్చివేసింది. ఈ సంఘటన మల్లంపేట్ నుంచి బాచుపల్లి క్రాస్ రోడ్స్ ద్వారా ప్రగతి నగర్‌కు వెళ్ళే మార్గంలో జరిగింది. ఈ మార్గం సాధారణంగా 3 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ప్రణీత్ ఏపీఆర్ ప్రణవ్ అంటీలియా' అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్మించిన గోడ కారణంగా ఈ దూరం 8 కిలోమీటర్లకు పెరిగింది. ఈ గోడ వల్ల చాలా రోజుల నుంచి పది కాలనీల నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మల్లంపేట్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేసి, ఈ గోడను తొలగిస్తే 40 నుంచి 60 అడుగుల వెడల్పు గల రహదారి మళ్లీ ఉపయోగంలోకి వస్తుందని విన్నవించారు. హైడ్రా అధికారులు ఈ ఫిర్యాదును పరిశీలించి, హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌యూడీఏ) ఆమోదించిన లేఅవుట్ ప్రకారం ఈ ప్రాంతం గేటెడ్ కమ్యూనిటీ కాదని గుర్తించారు. హెచ్‌ఎండీఏ నిబంధన 7 ప్రకారం, రహదారులను అడ్డుకునేలా గోడలు నిర్మించకూడదని స్పష్టంగా ఉంది. దీంతో హైడ్రా ఈ గోడను కూల్చివేసి, రహదారిని పునరుద్ధరించింది. ఈ మూడు రోజులు జాగ్రత్త. దీని ఫలితంగా, బాచుపల్లి-మల్లంపేట్ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ వద్ద ఇటీవల తెరిచిన ఎగ్జిట్ వద్ద హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ చర్యను పర్యవేక్షించారు. కొందరు వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని హెచ్చరించారు. ఈ గోడను కూల్చివేయడం వల్ల దాదాపు 25,000 మందికి పైగా ప్రయోజనం చేకూర్చింది బుద్ధ భవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో హైడ్రాకు రోడ్లు, పార్కులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 49 ఫిర్యాదులు అందాయి. గాజులరామారం, చెంగిచెర్ల, కొత్తగూడ వంటి ప్రాంతాల నుంచి కూడా ఇలాంటి ఫిర్యాదులు వచ్చాయి. హైడ్రాకు ఈ ఫిర్యాదులను పరిశీలించి, చట్టవిరుద్ధ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ చర్యలు ప్రజల రాకపోకలను సులభతరం చేయడమే కాక, పటిష్టమైన పట్టణాభివృద్ధికి దోహదం చేస్తున్నాయిట్రెండింగ్ లో బతుకమ్మ చెరువు...తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత తేడా స్పష్టంగా కనపడుతోందని అంటున్నారు నెటిజన్లు. దీనికి తాజా ఉదాహరణగా బతుకమ్మ కుంటను చూపిస్తున్నారు. ఇది కళ్లముందు కనపడుతున్న మార్పు అని అంటున్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట ప్రాంతంలో ఉన్న బతుకమ్మ కుంటను ఆక్రమణల చెరనుంచి కాపాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా) సాధించిన విజయాల్లో ఇది కూడా ఒకటి. బతుకమ్మ కుంటను కబ్జా కోరల్లోనుంచి రక్షించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు హైడ్రాకు సంబంధిత పత్రాలు అందజేయడంతో తొలి అడుగు పడింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా ఈ కుంటను పరిశీలించి పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేశారు. కొంతమంది ఈ కుంట స్థలం తమది అంటూ హైకోర్టుని ఆశ్రయించినా తుది తీర్పు హైడ్రాకు అనుకూలంగా వచ్చింది. దీంతో నేడు ఇది కొత్తరూపు సంతరించుకుంది. కబ్జా కోరల్లో ఎలా ఉండేది. హైడ్రాకు ముందు బతుకమ్మ కుంట చెరువు సరస్సు పునరుద్ధరణ పనులను చేపట్టింది. మొదటి రెండు ఫోటోలు హైడ్రా సరస్సు పునరుద్ధరణ పనులను చేపట్టడానికి ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో తీసిన బతుకమ్మ కుంట చిత్రాలు అప్పుడు 20 ఎకరాలు.. దాదాపు 20 ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో బతుకమ్మ కుంటగా ఉండేది. క్రమంగా కబ్జాల బారిన పడి అసలు కుంటే కనుమరుగైపోయింది. ప్రస్తుతం ఇందులో కేవలం 6 ఎకరాలు మాత్రమే మిగిలుంది. దాన్ని కూడా కబ్జా చేయాలని చూశారు కొంతమంది. హైడ్రా చొరవతో దానికి బ్రేక్ పడింది. చెరువుని పునరుద్ధరించి అక్కడ పరిసరాల్ని పరిశుభ్రం చేశారు.

# వేడెక్కుతున్న రాజకీయాలు

హైదరాబాద్, జూలై 9 తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. సవాళ్లు, ప్రతి సవాళ్లతో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతుంది. బీఆర్ఎస్ నేతలు ఎన్నిలకు మూడేళ్ల ముందే రా రమ్మంటూ కాంగ్రెస్ నేతలకు సవాల్ విసురుతున్నారు. ప్రతి చిన్న విషయానికి సై అంటే సై అంటున్నారు. ఎన్నికలకు తెలంగాణలో ఇంకా మూడేళ్లు సమయం ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల సమరం కోసమే ఈరకమైన ప్రయత్నాలు జరుగుతున్నాయన్న కామెంట్స్ వినవడుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ తాము అమలుచేస్తున్న సంక్షేమపథకాలపై చర్చకుసిద్ధమని ప్రకటించారు. అయితే ఇందుకు తాము సోమాజీ గూడ ప్రెస్ క్లబ్ కు వస్తున్నామంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దమ్ముంటే పాలనచేయాలని, సంక్షేమాన్ని అమలు చేయాలని, లేకుంటే అధికారాన్ని కేసీఆర్ కు అప్పగిస్తే పాలనఎలా చేయాలో చూపిస్తామని కేటీఆర్ అన్నారు. తాను చర్చకు సిద్ధమని ప్రెస్ క్లబ్ కు వస్తే తోకముడుచుకు పోయారంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రజలను మోసం చేస్తూ అబద్ధపు పాలన చేసే రేవంత్ రెడ్డికి అధికారంలో కొనసాగేందుకు అర్హత లేదని అన్నారు. ఏ వేదిక అయినా.. ఏ ప్లేస్ అయినా తాను చర్చకు రావడానికి సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. ఢిల్లీకి తిరుగుతూ ముడుపులు అందిస్తూ పదవులను కాపాడుకోవడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ప్రజా సంక్షేమాన్నిపక్కనపెట్టి పదవులను కాపాడుకోవడానికే కాలాన్నివెచ్చిస్తున్నారన్నారు. అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కేటీఆర్ తన సోదరి కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఫ్రస్టేషన్ లో ఉన్నారని, ముందు తన ఇంట్లో జరుగుతున్న సమస్యలను పరిష్కరించుకుని అప్పుడు చర్చకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నేతలు ప్రతి సవాల్ విసిరారు. అయ్య ఫామ్ హౌస్ లో పడుకున్నాడని, ప్రతిపక్షనేతగా అసెంబ్లీకి కూడా రావడం లేదని, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. తాము ఏ పాయింట్ పైనేనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. మొత్తం మీదస్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఈరకమైన సవాళ్లు, ప్రతి సవాళ్లు తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఎక్కువయ్యాయన్నది వాస్తవం.

# సమ్మెతో సింగరేణి 76 కోట్ల నష్టం

కరీంనగర్, జూలై 9,కరీంనగర్ లో సింగరేణి కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఒకరోజు టోకెన్ సమ్మె చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మె కారణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడనుంది. ఒక్కరోజు సమ్మెతో దాదాపు 76 కోట్ల రూపాయల విలువ చేసే బొగ్గు ఉత్పత్తికి నష్టం కలగనుంది.కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలన్నీ ఒక్కరోజు టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా సింగరేణిలోనూ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇప్పటికే కార్మిక సంఘాలన్నీ సింగరేణిలో సమావేశం నిర్వహించారు. ఒక్కరోజు సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలన్నీ గేట్ మీటింగ్ నిర్వహించాయి. విస్తృతంగా ప్రచారం చేశాయిమార్చి 20న సమ్మె చేయాలని అనుకున్నా.. యుద్ధం కారణంగా ఈ సమ్మె వాయిదా పడింది. గేట్ మీటింగ్ ల ద్వారా కార్మిక సంఘాలన్నీ విస్తృతంగా ప్రచారం చేశాయి. ఒక్కరోజు సమ్మెతో సింగరేణిపై పెనుభారం పడనుంది. దీంతో సమ్మెకు వెళ్లొద్దని సింగరేణి యాజమాన్యం కోరుతోంది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఐదు జాతీయ సంఘాల్లో నాలుగు ఏఐటీయూసీ, ఏఐబిజఅ, అమిజఅ, ఊఓూ.. సమ్మెకు మద్దతు తెలిపాయి. బీజేపీ అనుబంధ సంఘం ఃఓూ మాత్రం సమ్మెకు దూరంగా ఉంది. బీఆర్ఎస్ కు అనుబంధంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కూడా సమ్మెకు మద్దతు తెలిపింది. విప్లవ కార్మిక సంఘాలు సైతం సింగరేణి సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్మికుల హక్కులు రక్షించుకోవాలంటే సమ్మెలో కచ్చితంగా పాల్గొనాలని కార్మిక సంఘాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. రేపటి సమ్మెను విజయవంతం చేసే దిశగా కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా, ముమ్మరంగా ప్రచారం చేశాయి

# ప్రమాదాలకు నిలయంగా గుడిహత్నూర్ జాతీయ రహదారి



అదిలాబాద్, జూలై 9, ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ వద్ద జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. అతివేగం.. నిబంధనలు పాటించకపోవడం.. తదితర కారణలేమైనా తరచూ గుడిహాత్నూర్ వద్ద జాతీయ రహదారి 44తో పాటు ఇతర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రహదారులు నెత్తురోడుతుండగా, విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే పోలీసు, రవాణా శాఖాధికారులు హడావుడి చేసి మళ్లీ మరిచిపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ రహదారి కొన్ని ప్రాంతాల్లో ఏటవాలుగా ఉండటం, లారీలు అతివేగంగా రావడం, న్యూట్రల్ చేయడంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే లారీలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వీటిని జాతీయ రహదారి అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉ ంది. జిల్లాలో బ్లాక్ స్పాట్లను గుర్తించినప్పటికీ రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలోని భోరజ్ చెక్ పోస్టు, గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి, సీతాగోంది, డోంగర్ గావ్, నేరడిగొండ, తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా గుడిహత్నూర్ మండలకేంద్రంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇదే విషయంలో జాతీయ రహదారి గుండా ఉండే ప్రాంతాలు కుప్టి, బోథ్ ఎక్స్ రోడ్, ఉట్నూర్ ఎక్స్ రోడ్ ప్రాంతాలు సైతం ప్రమాదాలకు కేంద్రంగా మారుతున్నాయి.రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రత విషయం తమ పరిధిలోకి రాదని చెబుతుండటం, ఆర్.అండ్.బి. శాఖ వారే పర్యవేక్షిస్తున్నారని పేర్కొనడం.. ఆర్.అండ్.బీ శాఖ అధికారులు రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అయితే జిల్లాలోని జాతీయ రహదారి 44 నేరడిగొండ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు ఫోర్ లేన్ హైవేపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో మితిమీరిన వేగంతో నడపడంతో చిన్న వాహనాలను ఢీకొడుతున్నాయి. ఎన్.హేచ్.ఎ.ఐ అధికారులు బ్లాక్ స్పాట్లు గుర్తించినా సరిచేయడం లేదు. సర్వీసు రోడ్లు, అక్కడక్కడా అండర్ పాస్ లు వంటివి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. లారీ, ఐచర్, తదితర భారీ వాహనాల డ్రైవర్లు గుడిహత్నూర్ ధాబా నుండి సీతాగొంది వరకు న్యూట్రల్ చేసి తీసుకెళ్లడంతో స్పీడ్ అదుపు చేయలేక ఇటీవలే ఎన్నో వాహనాలు అదుపుతప్పి ఇతర వాహనాలను ఢీకొని ప్రమాదాలు జరిగాయి.అసలు చాలామంది వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు నిబంధనలు పాటించడం లేదు. దీంతోనే తరచూ జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుడిహత్నూర్ బస్టాండు సమీపంలో రోడ్డుపైనే వాహనాలు నిలపడడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్లో వాహనాలను తీసుకెళ్లడం, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం, ఆటోలు, జీపులు, కార్లలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, తదితర కారణాలతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు భద్రత చర్యలు చేపట్టకపోవడంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. రవాణా శాఖాధికారులు తనిఖీలు నామమాత్రంగా చేపట్టడంతోనే వాహనదారులు నిబంధనలను పాటించడం లేదనే ప్రచారం కోనసాగుతోంది. దీంతోనే అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది మృత్యువాత పడ్డారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు. గత 2022లో 234 ప్రమాదాలు జరగగా 137 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023 లో 286 ప్రమాదాలు జరగగా 126 మంది ప్రాణాలు కోల్పోయారు. 2024లో 349 ప్రమాదాలు జరగగా 136 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 2025 లో గత జూన్ నెల వరకు 137 ప్రమాదాలు జరగగా 51 మంది మరణించారు. 137 మంది క్షతగాత్రులయ్యారు. దీనిపై పోలీసులు జిల్లాలో 20 బ్లాక్ స్పాట్ లను గుర్తించారు.నేరడిగొండ మండలంలోని దూద్ గండి నుంచి బంధం ఎక్స్ రోడ్ వరకు, లఖంపూర్, రోల్ మామడ, నేరడిగొండ, ఇచ్చోడ మండలంలో రన్ని జిన్నింగ్ మిల్లు ప్రాంతంలో, ఆదిలాబాద్ వైపు వెళ్లే బైపాస్ వద్ద, గుడిహత్నూర్ మండలంలో మన్నూర్, మేకలగండి, ఈద్గా వద్ద, వాగాపూర్ ఎక్స్ రోడ్, సీతాగోంది, మావల మండలంలో దేవాపూర్ చెక్ పోస్టు, మావల బైపాస్, జైనథ్ మండలంలోని పూసాయి వద్ద జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను గుర్తించగా, ఇంద్రవెల్లిలోని ధనోర(బి), సమ్మక్క ఎక్స్ రోడ్, ఏమైకుంట, ఉట్నూర్ లోని పులిమడుగు, పెర్కగూడ, శ్యాంపూర్ లను గుర్తించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో జిల్లా పోలీసులు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. గుడిహత్నూర్ జాతీయ రహదారి విషయంలో ప్రయాణికులు మాత్రం డోంగర్గావ్ సమీపంలోని సర్వీస్ రోడ్డుపనులు త్వరగా పూర్తి చేయాలని రోడ్డుపై ఉ న్న బారీ కేడ్ల కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, జాతీయ రహదారి సంబంధిత శాఖ అధికారులు త్వరగా సర్వీసు రోడ్డు పూర్తి చేయాలని కోరుతున్నారు. గుడిహత్నూ ర్ లో సర్వీసు రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.24 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టిన గుత్తేదారు ఏళ్లుగా పూర్తి చేయకపోవడంతో పరిస్థితి అగమ్య గోచరంగా మారిందిగుడిహత్నూర్ నుంచి ప్రభత్వ జూనియర్ కళాశాల వరకు దాదాపుగా 500 మీటర్ల జాతీయ రహదారి మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేసి రెండు వైపులా ఒకే వరుసలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలతో పాటు చిన్నపాటి వాహనాల దారులు భయాందోళనకు గురవుతున్నారు. గుడిహత్నూర్ మండలం పరిధిలో 15 కిలో మీటర్ల మేర తరచూ ప్రమాదాలు జరుగు తాయి. ఆరు నెలల్లో 12 పమాదాలు జరగ్గా నలుగురు మృతి చెందారు.

# కమలంపై సంఘ్ ప్రభావం

హైదరాబాద్, జూలై 9, )భారతీయ జనతా పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలక మైన నిర్ణయాలను తీసుకుంటుంది. బీజేపీ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ కోసం పనిచేసిన వాళ్లను, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవాళ్లు, కమిట్ మెంట్ తో పనిచేసిన వాళ్లకు మాత్రమే అవకాశాలు కల్పిస్తామని చెప్పకనే చెబుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలను కొంత పక్కన పెడుతున్నట్లే కనపడుతుంది. దీంతో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల్లో కొంత అసంతృప్తులు పెరిగిపోతున్నాయి. అయినా కేంద్రంలో అధికారంలో ఉండటంతో ప్రస్తుతానికి ఏమీ మాట్లాడేందుకు బయటకు రాకపోయినా వారు మాత్రం త్వరలోనే ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.తెలంగాణలో కేంద్ర మంత్రి పదవులు రెండు ఇచ్చారు. అందులో ఒకటి కిషన్ రెడ్డి కాగా, మరొకరు బండి సంజయ్. ఇద్దరూ పార్టీలో సీనియర్ నేతలు. పార్టీతో దశాబ్దకాలం అనుబంధం ఉన్న వారు. ఇక్కడ సామాజికవర్గాలను చూడకుండా కేవలం పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికి మాత్రమే అవకాశం కల్పించారు. రాజ్యసభ స్థానాన్ని కూడా పార్టీలో సుదీర్ఘకాలంగా ఉన్న కె. లక్ష్మణ్ కు కేటాయించారు. అంతే తప్ప మరొకరికి ఈ అవకాశం ఇవ్వలేదు. ఇక తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు అనేక ఆశలు పెట్టుకున్నారు. కానీ అందరి ఆశలను తలకిందులు చేస్తూ పార్టీకి విధేయుడిగా ఉంటున్న కె.రామచంద్రరావును బీజేపీ అధ్యక్షుడిగా నియమించారు. ఆంధ్రప్రదేశ్ లోనూ అంతే జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే తమకు మంత్రి పదవి ఖాయమని చాలా మంది అంచనాలు వేసుకున్నారు. కానీ వారిందరినీ పక్కన పెట్టి సత్యకుమార్ యాదవ్ ను మంత్రి పదవికి ఎంపిక చేశారు. ఇక కేంద్ర మంత్రివర్గంలో పురంధ్రీశ్వరి లాంటి వాళ్లను పక్కనపెట్టి శ్రీనివాసవర్మ లాంటి పార్టీకి నిబద్ధత కలిగిన నేతను ఎంపికచేయడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇక రాజ్యసభ సభ్యుడిగా పాకా వెంకట సత్యనారాయణ ఎంపిక కూడా అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. ఇక తాజాగా పార్టీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మాధవ్ ను ఎంపిక చేయడంతోనే ఇక ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పదవులు ఉండబోవన్న సంకేతాలు ఇచ్చినట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.భవిష్యత్ లోనూ ఎంపికలు ఇలాగే ఉంటాయని చెబుతుండటంతో పార్టీ మారి వచ్చిన నేతలు కొంత పునరాలోచనలో పడినట్లు తెలిసింది.

# సిగాచి పరిశ్రమ మరిన్ని కష్టాలు

హైదరాబాద్, జూలై 9,పాశమైలారంలోని సిగాచీ రసాయన పరిశ్రమలో ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. నిన్న నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కూడా పరిశీలించి ఇదే రకమైన అనుమానాలను వ్యక్తం చేసింది. ఎన్ఎండీఏ బృందం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమను పరిశీలించిన అనంతరం ప్రమాదం జరిగిన స్థలంతో పాటు ఇంత మంది మరణానికి గల కారణాలను కూడా తెలుసుకునే ప్రయత్నం చేసింది. సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మొత్తం 44 మంది మరణించారు. ఇంత పెద్ద దుర్ఘటన ఫార్మా పరిశ్రమ చరిత్రలోనే లేకపోవడంతో షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కూడా రంగంలోకి దిగింది. రసాయన పరిశ్రమలను ఎలా నిర్వహణ చేస్తున్నారో అక్కడ పనిచేసిన అధికారులను అడిగి తెలుసుకుంది. వారిని ప్రశ్నలతో ఉ క్కిరి బిక్కిరి చేసింది. ఇప్పటికే మరణించిన కార్మికుల కుటుంబాలు పాత కాలం మిషనరీని వాడుతున్నారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కూడా విచారణ చేపట్టింది. రసాయన పరిశ్రమల్లో ఎప్పటి కప్పుడు యంత్ర సామగ్రిని ఆధునికీకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ఇంత పెద్ద ప్రమాదానికి కారణమయిందని ప్రాథమికంగా అభిప్రాయపడినట్లు తెలిసింది. ప్రమాదానికి రియాక్టర్ పేలడమే కారణమని తొలుత భావించినా మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో కూడా షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం దర్యాప్తు చేసింది. అధికారులను విచారించిన మీదట సిగాచీ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించినట్లు .అధికారులు కూడా సక్రమంగా సమాధానాలు ఇవ్వకపోవడంతో వారికి ఉన్న అవగాహనపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన నివేదికను షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించనుంది. ఇప్పటికే పరిశ్రమను మూడు నెలల పాటు మూసివేయడంతో మళ్లీ ప్రారంభిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది కూడా సూచించే అవకాశాలున్నాయి. ఇక సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో ఏడుగురు జాడ ఇంత వరకూ తెలియలేదు. శిధిలాల్లో లభ్యమైన మానవ శరీర భాగాలతో కుటుంబ సభ్యుల రక్తనమూనాలతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించినప్పటికీ సరిపోలక పోవడంతో ఆ ఏడుగురు జాడ కోసం మాత్రం ఇంకా అన్వేషణ కొనసాగుతూనే ఉంది.

# నిజామాబాద్ లో ముందుకు సాగని పనులు

నిజామాబాద్, జూలై 9 నిజామాబాద్ నగరం నుండి 44వ జాతీయ రహదారి కి అప్రో రోడ్ గా ఉన్న నిజామాబాద్ హైదరాబాద్ ప్రధాన రహదారి మాధవ నగర్ టీ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆర్ఓబి పనులు నిర్మాణం గడువు ముగిసినప్పటికీ ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గత మే 31 తో నిర్మాణ గడువు ముగిసినప్పటికీ జూన్ మాసం గడిచి జూలై ప్రారంభించి వారం రోజులు కావస్తున్నప్పటికిని.బ్రిడ్జి మధ్యలో బెడ్ అప్రో పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. హైదరాబాద్ వెళ్లే మార్గంలో కేవలం కుడివైపున మాత్రమే పనులు జరుగుతున్నాయి. ఎడమవైపు మొండి పిల్లర్లు దర్శనమిస్తున్నాయి. దాదాపుగా ఇంకా ఈ సంవత్సరం పూర్తి వరకు పనులు కొనసాగుతాయన్న సందేహాలు ప్రజల నుండి వ్యక్తం అవుతున్నాయి. ఒకవైపు తమ వంతు పూర్తి సహకారం కేంద్రం పూర్తి బడ్జెట్ కేటాయించినప్పటికిని రాష్ట్ర ప్రభుత్వం నుండి సరైన నిధులు అందడం లేదని ఇటీవల ఎంపీ అరవింద్ విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బిఆర్ఎస్ గవర్నమెంట్ కాంగ్రెస్ గవర్నమెంట్ సహకరించ డం లేదని బహిరంగంగా ఆరోపించారు.ఈ నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గానీ ఇన్చార్జి మంత్రులు గాని పత్రికలలో అరవిందు ఆరోపణలు వెలువడినప్పటికిని ఉ లుకు పలుకు లేకుండా ఉండడంతో కాలంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతాయో లేదో అని సందేహాలు ప్రజల నుండి తలెత్తుతున్నాయి. 93. 31 రూపాయల తో చేపట్టిన ఈ ఆర్ఓబి బ్రిడ్జి పనుల గడువు దగ్గర పడింది. 20 25 మే 31 నాటికి ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది.అని ఇప్పటివరకు పూర్తికాలేదు ఎందుకు రాష్ట్ర ప్రభుత్వాలే కారణం అని బిజెపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి. త్వరితగతిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని పది రైల్వే ఓవర్ బ్రిడ్జిల్లా పనులు లక్ష్యంగా పెట్టుకున్నామని నిజామాబాద్ ఎంపీ అరవింద్ ప్రకటించినప్పటికిని మాధవ నగర్ ఆర్ఓబి పనులు ఇంకా పూర్తి కాలేదు. మే 31 నాటికి గడువు పూర్తయి. 40 రోజులు వస్తున్నప్పటికిని పనులలో ఎలాంటి పురోగతి లేదు..గడువులోగా పూర్తవుతుందనుకున్నా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నిర్దిష్ట లక్ష్యం తో రాష్ట్ర ప్రభుత్వం గానీ స్థానిక ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడంతో నిధులలేమితో. ఆర్ఓబి పనులు చెతకిలాబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో జాప్యం జరిగిన కారణంగా నిర్మాణ పనులలో ఆలస్యం జరుగుతోందని ఎంపీ అరవింద్ తెలిపారు.ఈ రైలు మార్గం మీదుగా భారీ హె గ్యాటర్లతో ఫ్లోరింగ్ షీట్స్ వేయాల్సి ఉంది ఈ పని మొత్తం ఒకవైపు నుండి కొనసాగడంతో మరొకవైపు పని మిగిలిపోయి ఉంది. ఒకవైపు ఫ్లోరింగ్ స్లాబ్ పనులు జరుగుతూ ఉ ండడంతో మరోవైపు పనులకు గడువు దాటి పోయినప్పటికీని బ్రిడ్జ్ నిర్మాణ పనులు జరగడం లేదు. నిజామాబాద్ నగరం లోకి ప్రధాన ప్రవేశ ద్వారం మాధవ నగర్ రైల్వే మార్గం మీదుగా ఉండడంతో నిత్యం జిల్లాలలోకి వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.ఈ మార్గం నుంచి 50 కి పైగా ప్రయాణికుల రైలు గూడ్స్ బండ్లు ప్రయాణిస్తుండడంతో తరచూ రైలు మార్గానికి ఇరువైపులా గేట్లు చేయడంతో తరచూ వాహనాలు కిలోమీటర్స్ కు పైగా నిలిచిపోతున్నాయి అత్యవసర సర్వీసులు గల వాహనాలు అంబులెన్స్ కూడా ఈ రైల్వే గేట్ వేయడంతో ట్రాఫిక్ లో చిక్కుకుపోతున్నాయి. ట్రైన్లు వెళ్లిన తదుపరి గేట్లు ఎత్తేయడంతో ఇరువైపుల వాహనాలు దూసుకు రావడంతో కురుక్షేత్ర యుద్ధ దృశ్యాన్ని తలపిస్తోంది. గంటల తరబడి రైళ్లకే ఎదురు చూసి విసిగి గేటు నుండి వాహనాలను తరలించే సమయంలో ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. మాధవ్ నగర్ రైల్వే గేటు వద్ద పట్టాలపై నుంచి స్లాబ్ పనులు సాగాల్సి ఉందని అందుకు గాని ఇరువైపులా కొంత మేరకు పనులు నిలిపివేశామని పనులకు ఉపయోగించడానికి భారీ క్రేన్లు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని ఉద్దేశంతో పనులు నిలిచిపోయాయనీ సంబంధిత అధికారులు తెలిపారు.రైల్వే పనుల కారణంగా మిగతా పనులు జరపడంలో జాప్యం జరుగుతోందని రైల్వే అధికారుల అనుమతితో రైల్వే పట్టాల వరకు పనులు పూర్తి చేయనున్నట్టు ఆర్ఓబి పర్యవేక్షకులు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయం లోపించడంతోనే పనులలో తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఈ విరు శాఖల సమన్వయంతోటే పనులు నిర్ణిత సమయానికి పూర్తవుతాయని ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్ఓబి పనులు 20 22 సెప్టెంబర్ లో ప్రారంభం అయినప్పటికీని ఇప్పటివరకు 75% పూర్తికాగా మరో ముప్పు ఐదు శాతం పనులు పూర్తికావాల్సి ఉ ంది. నిర్ణీత సమయంలో మాధవ నగర్ రైల్వే బ్రిడ్జి పూర్తి అవుతే ఈ మార్గం గుండా ప్రయాణించే ప్రజల కష్టాలు తీరనున్నాయి.

# సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. రాజేష్

సిద్దిపేట ,సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా కె. రాజేష్ పదవీ బాధ్యతలు చేపట్టిన తదానంతరం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ. కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సి పి అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల రక్షణకు పెద్దపీట వేయాలని తెలిపారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాలలో పనిచేయని సీసీ కెమెరాలు గ్రామస్తులు మరియు వ్యాపారస్తులతో కలసి వెంటనే రిపేర్ చేయించాలని సూచించారు. మరియు గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. తరచుగా గ్రామాలను సందర్శించాలని తెలిపారు. విపిఓ వ్యవస్థను మరింత మెరుగుపరిచి వారంలో మూడు నాలుగు సార్లు గ్రామాలకు వెళ్ళేటట్లు షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు.

# నేడు జాతీయ మత్స్యరైతుల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని

)చేపల ప్రోటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడంలో, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో , దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో చేపల రైతులు పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించడానికి జాతీయ చేపల రైతు దినోత్సవం ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుంది.సుస్థిరమైన , అభివృద్ధి చెందుతున్న మత్స్య రంగం అభివృద్ధి కోసం చేపల రైతులు, ఆక్వాకల్చర్ పరిశ్రమ నిపుణులు ఇతర భాగస్వాముల అమూల్యమైన కృషిని గుర్తించడానికి , ప్రశంసించడానికి ప్రతి సంవత్సరం జూలై 10 న జాతీయ మత్స్య రైతుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.జాతీయ మత్స్య రైతుల దినోత్సవం 2023 చేపల రైతుల అపారమైన కృషిని , సుస్థిర ఆక్వాకల్చర్ పట్ల వారి నిబద్ధతను గుర్తించడానికి యావత్ దేశానికి ఒక అవకాశం. బాధ్యతాయుతమైన పద్ధతులను అవలంబించడం ద్వారా, మత్స్య రంగం సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా, మనం సుసంపన్నమైన భవిష్యత్తును నిర్ధారించవచ్చు, ఆహార భద్రతను పెంచవచ్చు. దేశ సమగ్ర అభివృద్ధికి దోహదపడవచ్చు.1957 లో ఇదే రోజున హైపోఫిసేషన్ టెక్నిక్ ద్వారా భారతీయ మేజర్ కార్ప్స్ లో ప్రేరిత సంతానోత్పత్తి , పునరుత్పత్తికి మార్గనిర్దేశం చేసిన భారతీయ మత్స్య రంగ ప్రొఫెసర్ డాక్టర్ హీరాలాల్ చౌదరి , ఆయన సహచరుడు డాక్టర్ కె.హెచ్.అలీకున్హి చేసిన కృషిని గౌరవించడానికి , జ్ఞాపకం చేసుకోవడానికి జాతీయ మత్స్య పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(ఎన్ఎఫ్ఎఫ్ డి ) జాతీయ చేపల రైతు దినోత్సవం నిర్వహిస్తోంది. జరుపుకుంటారు, వారి కృషి అంతిమంగా చివరికి ఇన్ లాండ్ ఆక్వాకల్చర్ లో విప్లవానికి దారితీసింది. చేపల పెంపకందారులు, ఆక్వాప్రెన్యూర్లు (ఆక్వా వ్యవసాయ రంగంతో సంబంధం ఉన్న వ్యాపారవేత్తలు) , మత్స్యకారులు దేశ మత్స్య రంగం అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించడం , మన మత్స్య వనరులను సుస్థిరంగా నిర్వహించే మార్గాలను సమిష్టిగా ఆలోచించడానికి, చర్చించడానికి ఒక పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ముఖ్య ఉద్దేశ్యం. చేపల ప్రోటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడంలో, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో , దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో చేపల రైతులు పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించడానికి జాతీయ చేపల రైతు దినోత్సవం ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుంది. ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులను అవలంబించడంలో, చేపల ఉత్పాదకతను మెరుగుపరచడంలో , జల వనరులను సంరక్షించడంలో వారి అంకితభావం , ఆవిష్కరణను ఇది చాటి చెబుతుంది. కొన్నేళ్లుగా, శాస్త్రీయ పరిశోధన , సాంకేతిక జోక్యాలతో మత్స్య రంగం గణనీయమైన పురోగతిని సాధించింది.ఈ సందర్భంగా, విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి, అనుభవాలను పంచుకోవడానికి , భాగస్వాముల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి దేశవ్యాప్తంగా సెమినార్లు, వర్క్ షాప్ లు, ఎగ్జిబిషన్ లు, ఇంటరాక్టివ్ సెషన్ లు వంటి వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తారు. మత్స్య రంగానికి చెందిన నిపుణులు, వృత్తి నిపుణులు ఆక్వాకల్చర్ లో తాజా పరిణామాలు, పరిశోధన ఫలితాలు, నూతన ధోరణులపై అవగాహన కల్పిస్తారు

# విద్యార్థులను సొంత పిల్లలగా భావించాలి

**కలెక్టర్ హైమవతి**

సిద్దిపేత,నేను ఒకప్పుడు టీచర్ నే. విద్యార్థులను సొంత పిల్లగా భావించాలని జిల్లా కలెక్టర్ కే. హేమావతి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ తొగుట మండల కేంద్రంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ను మరియు నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కంకర, ఇసుక, రాడ్ అన్ని సమపాళ్లలో కలిపి పది కాలాలపాటు మన్నికగా ఉండేలా ఇళ్ల నిర్మాణాలను దగ్గర ఉండి కట్టించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.అనంతరం తొగుట జడ్పీ హైస్కూల్ ను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం కాకుండా ఒక కూర మరియు గుడ్డు మాత్రమే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసి వివరాలను డీఈఓ కు పంపించాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచికరంగా ఉందా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు ప్రభుత్వం రోజువారి మెనూ ను మధ్యాహ్న భోజనం కోసం రూపొందించ్చిందని నేను మళ్ళీ వస్తానని మెనూ ప్రకారం భోజనం లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. అలాగే నేను ఒకప్పుడు టీచర్ నే అని విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పి భావి వి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పర్యటనలో తొగుట తాసిల్దార్ శ్రీకాంత్, ఎంఈఓ నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ తదితరులు ఉన్నారు.

# వల్లభనేని వంశీకి ఏమైంది...



విజయవాడ, జూలై 9, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర అస్వస్థతతో విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చేరారు. కొద్ది రోజుల కిందటే ఆయన బెయిల్ పై విడుదలయ్యారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 135 రోజులపాటు ఆయన జైల్లో గడపాల్సి వచ్చింది. ఆ సమయంలోనే పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారు. జైలు నుంచి ఆసుపత్రులకు తీసుకొచ్చి చికిత్స అందించేవారు. ఇప్పుడు బెయిల్ పై వచ్చిన ఆయన మరోసారి అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న ఏపీ పోలీసులు హైదరాబాదుల ఉన్న వల్లభనేని వంశీ మోహన్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై 11 కేసులు నమోదు చేశారు. అనేకసార్లు ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఎప్పటికప్పుడు బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యేవి. ఎట్టకేలకు ఈనెల 2న ఆయనకు బెయిల్ లభించింది. దీంతో ఆయన బయటకు వచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆ మరుసటి రోజున భార్యతో కలిసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అటు తరువాత మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని వల్లభనేని వంశీని పరామర్శించారు. ఇంతలోనే ఆయన అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రిలో చేర్పించారు.

నట రత్నాలు, నట శేఖర లు ఎక్కడో వుండరు,
మన చుట్టూ గన్నవరం గాండు, గుడివాడ గుట్కా రూపాల్లో తిరుగుతూ వుంటారు..
వాడు ఆరోగ్యం బాగోపోతే హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకోవాలి కానీ, వీడియోలు తీసి సోషల్ మీడియా లో పెట్టి డ్రామా లు ఎందుకు?

వల్లభనేని వంశీ మోహన్ దూకుడుగా వ్యవహరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో చంద్రబాబుతో పాటు లోకేష్ పై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. ఈ ఎన్నికల్లో గన్నవరం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన విదేశాలకు వెళ్లిపోతారని ప్రచారం జరిగింది. ఇంతలోనే పాత కేసులను తిరగదోడుతూ ఏపీ పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టు కూడా చేశారు. దాదాపు 135 రోజులపాటు వంశీ జైల్లోనే గడపాల్సి వచ్చింది. వాస్తవానికి గతంలో కూడా వల్లభనేని వంశీ మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే జైల్లోకి వెళ్లిన తరువాత అనారోగ్యం మరింత తీవ్రమైంది. ఇప్పుడు బయటకు వచ్చినా ఆ ప్రభావం ఇంకా కనిపిస్తోంది.

# ఆనం అసంతృప్తికి కారణం అదేనా



నెల్లూరు, జూలై 9, ఆనం రామనారాయణరెడ్డి ఎప్పుడూ అసంతృప్తి నేత మాత్రమేనా? జిల్లాలో తన మాట శాసనం అనుకుంటున్నారా? ఇంకా పాత కాలం నాటి రోజులుగా ఆనం రామనారాయణరెడ్డి భావిస్తున్నట్లుంది. సాక్షాత్తూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఎదుటే మంత్రి నారాయణపై అసంతృప్తిని వెళ్లగక్కి ఆనం రామనారాయణరెడ్డి తన దైన శైలిని ఆయన మరోసారి చాటుకున్నారు. అందుకే సీనియర్ నేతలను పక్కన పెట్టి కొత్త తరం నేతలను రాజకీయాల్లోకి తీసుకు రావాలన్న టీడీపీ అధినాయకత్వం ఆలోచన కరెక్టే అనిపిస్తుంది. ఈ సీనియర్లు తమదే ఆధిపత్యం కావాలని కోరుకుంటారు. ఫలితంగా పార్టీలో రాజకీయ ఇబ్బందులు తలెత్తక తప్పవు. అందుకే టీడీపీలో క్రమంగా సీనియర్ నేతలను పక్కన పెడుతున్నారు.. నెల్లూరు నగరంలో నిన్న అంతర్జాతీయ ప్రమాణాలతో నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి వీఆర్ హైస్కూల్ ను మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. మంత్రి నారాయణ మున్సిపల్ నిధులు వెచ్చించి ఈ పాఠశాలకు మరమమ్మతులుచేయించారు. దీంతో వీఆర్ మున్సిపల్ హైస్కూలు అని నామకరణం చేశారు. అందుకు ఆనం రామనారాయణరెడ్డి అభ్యంతరం తెలిపారు. తమ కుటుంబం ఆధ్వర్యంలో దశాబ్దాలుగా ఉన్న వీఆర్ విద్యాసంస్థలను మున్సిపల్ స్కూలు అని ఎలా నామకరణం చేస్తారని లోకేశ్ ఎదుటే ప్రశ్నించారు. నారాయణ తన శాఖ నిధులతో ఖర్చు చేస్తే పేరు మారుస్తారా? అని నిలదీశారు. అంతేకాదు నారాయణ మున్సిపల్ పాఠశాలలను దత్తత తీసుకుని వాటిని బాగు చేస్తే మంచిదని హితవు పలికారు. ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలతో లోకేశ్ సయితం విస్తుపోయారు ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్ లో ఉన్ననాళ్లు మంత్రిగా ఉండి జిల్లాపై ఆధిపత్యాన్ని చెలాయించారు. అయితే 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆయన టీడీపీలో చేరారు. కానీ ఆ ఎన్నికల్లో గెలవలేకపోయారు. కానీ తనకు ఎమ్మెల్సీ సీటు కూడా ఇవ్వలేదని నాడు టీడీపీని వదిలేశారు. 2019 ఎన్నికలనాటికి వైసీపీలో చేరారు. వెంకటగిరి నియోజకవర్గం నుంచి టిక్కెట్ పొంది విజయం సాధించారు. అయితే జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆయనకు మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. దీంతో అసంతృప్తికి గురయిన ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికలకు ముందు నుంచే అధికార వైసీపీ ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తూ వార్తల్లోకి ఎక్కారు. అంటే మరోసారి పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. గతంలో టీడీపీని వదిలి వెళ్లినా ఆనం రామనారాయణరెడ్డిని చంద్రబాబు నాయుడు తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. ఆనం కుటుంబానికి నెల్లూరులో ఉన్న పేరు ప్రఖ్యాతుల దృష్ట్యా ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకుని ఆత్మకూరు నియోజకవర్గం టిక్కెట్ ను 2024 ఎన్నికల్లో కేటాయించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన ఆనం రామనారాయణరెడ్డికి మంత్రివర్గంలో చోటు కూడా కల్పించారు. అయితే తనకు ఇష్టంలేని దేవాదాయ శాఖను అప్పగించడం కొంత అసంతృప్తికి గురైన ఆనం అందులోనే ఉంటూ సర్దుకుపోతున్నారు. కానీ నెల్లూరు జిల్లాలో సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కాదని ఆనం రామనారాయణరెడ్డి కి మంత్రిపదవి ఇచ్చినా ఆయన తృప్తిపడనట్లే కనిపిస్తుంది.. నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ హవా నడుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, లోకేశ్ కు నారాయణ సన్నిహితుడు కావడంతో జిల్లా అధికారులు కూడా ఆయనకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ఆనం రామనారాయణరెడ్డికి ఇబ్బందికరంగా మారింది. తన సొంత జిల్లాలో నారాయణ పెత్తనమేంటన్న అభిప్రాయం ఆయనలో బలంగా ఉన్నట్లుంది. అందుకే లోకేశ్ వేదికపైనే ఉన్నా ఏ మాత్రం సంకోచం లేకుండా విమర్శలు చేయడంతో నెల్లూరు టీడీపీలో విభేదాలు బయటకు భగ్గుమన్నాయి. ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వం సీరియస్ గా తీసుకున్నట్లు తెలిసింది. ఆనం రామనారాయణరెడ్డి ఎప్పుడూ ఆధిపత్యం కోసమే ప్రయత్నిస్తుంటారని, అందులో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# వేటు పడింది..

తిరుమల, జూలై 9, టీడీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా పని చేస్తున్న ఏ.రాజశేఖర్ బాబును ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. తిరుపతి జిల్లా పుత్తూరులోని స్వగ్రామంలో రాజశేఖర్ బాబు ప్రతీ ఆదివారం స్థానిక చర్చి ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంతో టీటీడీ ఉద్యోగిగా ఆయన సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని భావించడమేకాక, హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగి అయివుండి భాద్యతారహితంగా వ్యవహరించడం జరిగిందని టీడీపీ తేల్చి?ంది. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం ఆయనపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు , తక్షణమే సస్పెండ్ చేయడం జరిగిందని టీటీడీ ప్రకటించింది. ఇటీవల టీటీడీలో పని చేస్తూ అన్యమతాన్ని ఆచరిస్తున్న వారిని బయటకు పంపింది. కోరుకున్న వారికి వీఆర్ఎస్ లేకపోతే ఇతర సంస్థల్లోకి డిప్యూటేషన్ మీద పంపించారు. 2025 ఫిబ్రవరి 1న 18 మంది క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నవారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఈ ఉద్యోగులు హిందూ సంప్రదాయాలను అనుసరిస్తామని ప్రమాణం చేసినప్పటికీ, అన్యమత కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. వీకంజకితీ బదిలీ లేదా వీఆర్ఎస్ అవకాశం ఇచ్చారు. వినియోగించుకోకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. టీటీడీలో పని చేసే ఉద్యోగులు ఖచ్చితంగా హిందూ మతాన్ని ఆచరించాలన్న నిబంధన ఉంది. టీటీడీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా పనిచేస్తున్న ఏ.రాజశేఖర్ బాబు తిరుపతి జిల్లా పుత్తూరులో ప్రతి ఆదివారం స్థానిక చర్చి ప్రార్థనల్లో పాల్గొంటున్నాడనే సమాచారం అందింది. ఓ భక్తుడు ఆయన చర్చి ప్రార్థనల్లో పాల్గొంటుండగా ఫొటోలు, వీడియోలు తీసి టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన అధికారులు రాజశేఖర్ బాబును సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. 2007లో టీటీడీ నిర్వహించే లేదా ఆర్థికంగా సహాయపడే సంస్థలలో హిందువులను మాత్రమే నియమించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఒక హిందూ మత సంస్థగా ఉండాలని, అన్యమత ఉద్యోగులు దీనిలో పనిచేయకూడదని స్పష్టం చేస్తున్నారు.టీటీడీలో పని చేస్తూ హిందువులుగా చెప్పుకుని చర్చిలకు వెళతున్న వారితోనే అసలు సమస్య వస్తోంది. తమ మతాన్ని అంగీకరించి.. టీటీడీలో కాకుండా డిప్యుటేషన్ పై ఇతర శాఖలకు వెళ్లేందుకు వారు ఆసక్తి చూపించడం లేదు.

# పవన్ ధీమా వెనుక...



కాకినాడ, జూలై 9, చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నా.. సర్ధుకోవాలి..కలిసి పోవాలి..! ఇలా ఒకదాని వెంట మరోటిగా తూటాల్లాంటి మాటలతో సొంత నేతలకు హితబోధ చేశారు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఇదే సమయంలో ప్రత్యర్థికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎలా వస్తారో మేమూ చూస్తామంటూ సవాల్ చేశారాయన. ఈ కామెంట్లపైనే ఇప్పుడు ఏపీలో జోరుగా చర్చ సాగుతోంది. పవన్ వ్యాఖ్యల వెనుక మతలబేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కీలక వ్యాఖ్యలు చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్. నాకు కొంచెం తిక్కుంది.. కానీ దానికో లెక్కుంది. ఇది ఓ పాపులర్ సినిమాలో పవన్ కల్యాణ్ చెప్పిన డైలాగ్. అచ్చం ఇదే మాదిరిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడే ప్రతి మాటకూ ఓ లెక్క ఉంటుంది. వినే వాళ్లు, చూసే వాళ్లు అది తెలుసుకోవాలి అంతే. లేటెస్ట్‌గా జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్.. మరోసారి అత్యంత కీలకమైన కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పార్టీలను ఉద్దేశించి ఆయన చేసిన కామెంట్లే ఇప్పుడు పొలిటికల్ సర్కిళ్లలో హాట్ టాపిక్‌గా మారాయి. కూటమి పార్టీల మధ్య విభేదాలు ఉన్నాయంటూ.. ఓవైపు కూటమి పార్టీలకు చెందిన నేతల మధ్య మనస్పర్థలు, అసంతృప్తులు కొనసాగుతున్నాయని విపక్ష వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పైకి కలిసి ఉన్నట్లుగా చెప్పుకుంటున్న కూటమి పార్టీలు.. కొన్నిచోట్ల లోలోన కత్తులు దూసుకుంటున్నాయని సెటైర్లు వేస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలకు కూటమిలో పెద్దగా ప్రాధాన్యం లేదని ప్రచారం చేస్తున్నారు వైసీపీ నేతలు. అంతెందుకు ఏపీలో కూటమి పాలన ఏడాది పూర్తి చేసుకున్న వేళ.. గడపగడపకూ టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు వెళుతున్నారు. ఈ సంవత్సర కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రచారం చేస్తున్నారు. కానీ, జనసేన, బీజేపీ నేతలు మాత్రం ఎక్కడా వీటిల్లో పాల్గొనడం లేదు. దీనిపైనా ప్రత్యర్థి వైసీపీ విమర్శల బాణాలు ఎక్కుపెడుతోంది. సరిగ్గా ఇలాంటి వేళ.. ప్రకాశం జిల్లా పర్యటనలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ప్రత్యర్థి పార్టీ నేతల కామెంట్లకు కౌంటర్లు వేశారు. ఇదే సమయంలో కూటమి పార్టీలకు కొన్ని సూచనలు చేశారాయన. ఏపీలో కూటమి పాలన 15 ఏళ్లైనా సాగాలన్న పవన్. ఏపీలో కూటమి పాలన కనీసం 15 ఏళ్లపాటైనా సాగాలని ఆకాంక్షించారు పవన్ కల్యాణ్. అప్పుడే ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సరిగా చేరతాయన్నారు. ఈ క్రమంలోనే కూటమి పార్టీలు కలిసి కట్టుగా సాగడం ఎంతో అవసరం అంటూ హితబోధ చేశారు పవన్. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా మూడు పార్టీలు కలిసి పోటీ చేసినప్పుడు చిన్నచిన్న అసంతృప్తులు సహజమన్నారాయన. అందుకే ఏ పార్టీనీ తక్కువగా అంచనా వేయొద్దని సూచించారు పవన కల్యాణ్. పిడికిలిలా కూటమి ముందుకు సాగాలన్న పవన్. అన్ని వేళ్లూ ఒకేలా ఉండవన్నారు జనసేన అధినేత. అయినా సరే ఏ వేలి బలం ఆ వేలుకు ఉంటుందన్నారు. అందుకే పిడికిలిలా ముందుకు సాగాలన్నారు. ఇక్కడ కూటమి అంటేనే ఓ పిడికిలి అంటూ మూడు పార్టీల కార్యకర్తలకు హితబోధ చేశారు పవన్. ఎన్ని సమస్యలు, ఇబ్బందులు వచ్చినా రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగడం తప్పనిసరి అన్నారు పవన్. ఇదే సమయంలో తనకు పాలనలో ఏ మాత్రం అనుభవం లేదన్నారు. కానీ, గట్టిగా పోరాడే ధైర్యం మాత్రం ఉందన్నారు పవన్. కూటమిలో టీడీపీ అధినేత చంద్రబాబు లేకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఇంత ప్రణాళికా బద్ధంగా నడిపించడం కష్టమంటూ చెప్పుకొచ్చారాయన. కొట్టుకోమని అధికారం ఇవ్వలేదంటూ హితబోధ. కష్టపడమని, సమస్యలు పరిష్కరించమని కూటమి పార్టీలకు ప్రజలు అధికారం ఇచ్చారన్నారు పవన్. అంతేకాని కొట్టుకోమని కాదంటూ సుతిమెత్తగానే ఘాటైన హెచ్చరికలు చేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్తా, నాయకుడు గుర్తు పెట్టుకోవాలని సూచించారు జనసేన అధినేత. తనకు జనసేన సంక్షేమం, కూటమి సంక్షేమం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యమని తెగేసి చెప్పారు పవన్. తద్వారా పరిస్థితులు ఎలా ఉన్నా.. కూటమి పార్టీలు కలిసి కట్టుగా సాగాల్సిందేనన్న సందేశం ఇచ్చారన్న అభిప్రాయం గట్టిగా విన్పిస్తోంది. 2029లో ఎలా అధికారంలోకి వస్తారో చూస్తామంటూ.. సవాల్. కేవలం కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులకు హితబోధ చేయడమే కాదు.. ప్రత్యర్థి పార్టీకి గట్టి వార్నింగ్ ఇచ్చారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. రౌడీయిజానికి, గూండాయిజానికి భయపడితే రాజకీయం చేస్తామా అంటూ ప్రశ్నించారాయన. వేం అధికారంలోకి వస్తే అంటూ వైసీపీ నేతలు చెబుతున్నారని.. అసలు 2029లో వైసీపీ ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తామంటూ సవాల్ విసిరారు పవన్ కల్యాణ్ .మొత్తంగా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు విశ్లేషిస్తే.. కూటమిగా కలిసి కట్టుగా సాగాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ సాగాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాదు.. ఎన్డీఏ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తాను ఆ దిశగా ఎప్పుడూ కృషి చేస్తూ ఉంటానన్న సంకేతాలను మరోసారి బలంగా పంపారన్న కామెంట్లు విన్పిస్తున్నాయి.

# నెల్లూరు లో నేలబారు రాజకీయాలు

నెల్లూరు, జూలై 9, సింహపురి రాజకీయాలు వేడెక్కాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నెల్లూరు పాలిటిక్స్ మాత్రం ఇప్పుడు దాడులతో హీటెక్కాయి. నెల్లూరు జిల్లా అంటే ప్రశాంతతకు మారు పేరు. గత కొన్ని దశాబ్దాలుగా అనేక మంది నెల్లూరు నుంచి రాజకీయాల్లో ఎదిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మాత్రం అందుకు విరుద్ధంగా దాడులు జరుగుతున్నాయి. నేతల మధ్య వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. నెల్లూరు జిల్లాలో రెడ్డి సామాజికవర్గానిదే ఆధిపత్యం. గతంలో ఈ జిల్లా నుంచి ఆనం గోపాల్ రెడ్డి నుంచి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి వరకూ ఎంతో హుందాగా రాజకీయాలు నడిచేవి. వ్యక్తిగత విమర్శలకు అసలు చోటుండేవికావు. కేవలం రాజకీయ విమర్శలు మాత్రమే ఉండేవి. కానీ రాను రాను రాష్ట్ర వ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిణామాలు సింహపురి రాజకీయాలను కూడా మార్చేస్తున్నాయి. హుందాగా రాజకీయాలు చేసిన నేతలు ఇప్పుడు చౌకబారు విమర్శలకు దిగుతున్నారు. అంతేకాదు.. రాజకీయ విమర్శలను పక్కన పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ఫలితంగా దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నాయి. డబ్బు పుష్కలంగా ఉంది. అధికారం కూడా నెల్లూరు రెడ్లకు ఉంది. అయితే అన్నింటికీ మించి నెల్లూరు రెడ్లు రాజకీయాల్లో సంస్కారవంతంగా వ్యవహరిస్తారన్న పేరుంది. అలాంటి నెల్లూరు రాజకీయాలు నేడు నేలబారుకు చేరుకున్నాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య వివాదం చోటు చేసుకుంది.. మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై అవినీతి ఆరోపణలను వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేశారు. దానికి కౌంటర్ ఇవ్వడంలో భాగంగా నల్లపురెడ్డి ప్రసన్నకుమార రెడ్డి కొంత ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత దుర్భాషలకు దిగారు. దీంతో ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడులు జరిగాయి. ఇంట్లో ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు. వాహనాలను ధ్వంసం చేశారు. అయితే ఈ దాడులు వేమిరెడ్డి కుటుంబం మాత్రమే చేసిందని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆరోపిస్తున్నారు. డబ్బు ఉందన్న అహంకారంతో దాడులకు పాల్పడుతున్నారని, తాను ఎక్కడా తప్పు మాట్లాడలేదని, తాను ఆమెపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తెలిపారు. ..: దాడితో తమకు సంబంధం లేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. దాడుల సంస్కృతి తమది కాదన్న ఆమె ప్రసన్నకుమార్ వల్ల చాలా మంది బాధపడ్డారన్నారు. వారిలో ఎవరో ఒకరు దాడి చేసి ఉండొచ్చని ప్రశాంతిరెడ్డి చెప్పారు.

# ట్రెండింగ్ లో అన్నా చంద్రన్నా పాట

తిరుపతి, జూలై 9, సాహిత్యంతో పనిలేదు. రాగంతో అవసరం లేదు. పల్లవి ప్రస్తావన వద్దు. పదాలు సరదాగా ఉంటే చాలు. రాగం అదే పుట్టేస్తుంది. సాహిత్యం అదే వచ్చేస్తుంది. దాని తగ్గట్టుగా దరువు తోడైతే చాలు.. ఆ పాటను సోషల్ మీడియాలోకి ఎక్కిస్తే చాలు.. ట్రెండింగ్ లోకి వచ్చేసినట్టే. నేటి కాలంలో అటువంటి పాటలకు ఏ స్థాయిలో డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.సరిగా నాలుగు నెలల క్రితం కోయా రే కోయా పాట ఎంతటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చివరికి ఓ హీరో తన సినిమాలో ఈ పాటను పెట్టుకున్నారు. అంతకుముందు ఓ మతాన్ని ఆచరించే మహిళ.. తను ఆరాధించే దేవుడిని స్తుతిస్తూ పాడిన పాట.. ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా బోలెడు ఉంటుంది. ఫేమస్ అవ్వడానికే వారంతా ఇది చేస్తుంటారు. ఒకప్పుడు ఇటువంటి పాటలు ఉన్నప్పటికీ అంతగా వెలుగులోకి వచ్చేవి కాదు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత.. రకరకాల రూపాలలో అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఓ పాట కూడా ఇలాంటిదే.కొంతమంది మహిళల బృందం “చంద్రన్నా.. మాయన్నా” అనే పేరుతో ఓ పాటను పాడారు. ఆ పాట ఒక పల్లె పదానికి పేరడీ మాదిరిగా ఉంది.. ఒంటిపై ముడతలు పడ్డాయని.. రెండు కాళ్లు పోయి మూడో కాలు వచ్చిందని.. చూపు మందగించిందని.. శరీరం సత్తువ కోల్పోయిందని.. 50 ఏళ్ల వయసు నుంచి 60 ఏళ్ల వయసు వచ్చేసిందని ఆ పాట పాడుతున్న మహిళలు పేర్కొన్నారు..సహజంగా ఈ పాటలో చంద్రన్న అనే ప్రస్తావన ఉండడంతో కొంతమంది కావాలని ఈ పాటను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.. ఆ పాటను కావాలని ఓ పార్టీ నాయకులు ఈ స్థాయిలో విమర్శిస్తున్నారని నెటిజన్లు అంటున్నారు.. ఆ మహిళలు చంద్రన్న అనే పేరు ఒక రాజకీయ నాయకుడిని ఉద్దేశించి పాడలేదని.. కేవలం జనాలకు అర్థమవ్వడానికే పేరును ప్రస్తావించారని పేర్కొంటున్నారు. దానివల్ల జనాలకి ఈజీగా కనెక్ట్ అవుతుందని వారు భావించారు. కానీ కొంతమంది మాత్రం ఈ పాటకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. తమ రాజకీయ ప్రాబల్యం కోసం ఈ పాటను వక్ర భాష్యం చెబుతున్నారని నెటిజన్లు అంటున్నారు.ఆ మహిళలు ఓ భజన సంఘంలో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. వారి వ్యవహార శైలి.. ధరించిన దుస్తులు.. పెట్టుకున్న బొట్లు.. భజన సంఘాన్ని ప్రతిబింబిస్తున్నాయి. తమ భజన సంఘం ద్వారా వారు ఈ పాటలు పాడే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. వారు సమాజాన్ని మేల్కొల్పే ఉద్దేశంతో పాటలు పాడితే.. కొంతమంది మాత్రం పనిగట్టుకొని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు.. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చకు దారితీస్తోంది. ఇదే సమయంలో వీక్షణలు సొంతం చేసుకుంటున్నది

# బ్రెయిన్ స్ట్రోక్ ఎందుకు వస్తుంది.. అలర్ట్‌గా లేకపోతే అంతే?



బ్రెయిన్ స్ట్రోక్ అనేది మెదడులో రక్త సరఫరా నిలిచిపోయినప్పుడు లేదా తగ్గినప్పుడు సంభవించే పరిస్థితి. ఇది ఒక అత్యవసర వైద్య పరిస్థితి, దీనిని తక్షణమే గుర్తించి చికిత్స చేయకపోతే, మానసిక , శారీరక సమస్యలు, అలాగే మరణానికి కూడా దారితీస్తుంది. రక్తనాళాల్లో అవరోధం లేదా అవి చీలిపోవడమే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చేందుకు ప్రధాన కారణాలు . దీనికి హైపర్‌టెన్షన్, కొలెస్ట్రాల్ స్థాయి, డయాబెటిస్, ఇతర జీవనశైలి సంబంధిత కారణాలు ప్రభావితం చేస్తాయి. బ్రెయిన్ స్ట్రోక్ రకాలు: బ్రెయిన్ స్ట్రోక్‌లో రెండు ప్రధాన రకాల ఉన్నాయి. వాటిల్లో ఇస్కీమిక్ స్ట్రోక్ ఒకటి. ఇది సగం పైగా స్ట్రోక్‌లకు కారణం అవుతుంది. రక్తంలో గడ్డలు ఏర్పడి రక్తం సరఫరా నిలిచిపోయినప్పుడు ఇది జరుగుతుంది. ఇది మెదడులో ఆక్సిజన్ తక్కువగా ఉండడానికి కారణమవుతుంది. హేమరేజిక్ స్ట్రోక్ ప్రధానంగా మెదడులో రక్తనాళాలు చిట్లిపోవడం వల్ల సంభవిస్తుంది, దీని వల్ల మెదడులో రక్తస్రావం అవుతుంది. "క్యారెట్ తెగ తింటున్నారా... అయితే ఈ విషయాలు తెలుసుకోండి!" బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు: బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీసే కారణాలలో అధిక రక్తపోటు బ్రెయిన్ స్ట్రోక్‌కు ప్రధాన కారణం. రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు, రక్తనాళాలపై ఒత్తిడి పెరుగుతుంది, దీనివల్ల అవి చిట్లిపోవడం లేదా గడ్డలు ఏర్పడే అవకాశం ఉంటుంది. అధిక కొలెస్ట్రాల్ రక్తనాళాల్లో పేరుకుపోయి అవి కుంచింపుకు గురవుతాయి. ఇది రక్త ప్రసరణలో అంతరాయం కలిగిస్తుంది, దీని వల్ల మెదడులో రక్తం నిలిచిపోయి స్ట్రోక్ సంభవిస్తుంది. షుగర్ స్థాయి ఎక్కువగా ఉండడం వల్ల రక్తనాళాలపై ప్రభావం చూపుతుంది, ఇది స్ట్రోక్ వచ్చే అవకాశం పెంచుతుంది. ధూమపానం, మద్యం, వ్యాయామం లేని జీవనశైలి వంటి అలవాట్లు బ్రెయిన్ స్ట్రోక్ కు కారణమవుతాయి. ధూమపానం వల్ల రక్తనాళాలు సంకుచిస్తాయి, మద్యం వల్ల రక్తపోటు పెరుగుతుంది. కుట ుంబంలో స్ట్రోక్ చరిత్ర ఉన్నవారిలో స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువ ఉంది. బొత్స లోకేష్ , పయ్యావుల కేశవ్। బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు: బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు గుర్తించాల్సిన కొన్ని ముఖ్య లక్షణాలు ఉన్నాయి. ముఖం, చేతులు, కాళ్లలో ఒక్కసారిగా నొప్పి లేక తిమ్మిరి రావడం. మాట్లాడే సామర్థ్యం తగ్గడం, మాటల్లో తడబడటం. తలనొప్పి, విపరీతంగా కళ్ల ఎదుట గందరగోళం రావడం. సమతుల్యత కోల్పోవ డం లేదా నడకలో తడబాటు వంటి లక్షణాలు కన్పిస్తాయి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు: బ్రెయిన్ స్ట్రోక్ ను నివారించడానికి సాధ్యమైనంత వరకు రక్తపోటు, షుగర్ , కొలెస్ట్రాల్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించు కోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, మానసిక ఒత్తిడిని తగ్గించడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలను తగ్గించుకోవచ్చు.

# కీళ్ళవాతం తగ్గించే ఆహారాలు ఇవే.. తెలుసుకోండి!



వయసుతో సంబంధం లేకుండా ఇప్పుడు చిన్నా పెద్దా తేడా లేకుండా చాలామంది కీళ్ళ వాతంతో బాధ పడుతున్నారు. మన జీవన శైలి, శారీరక శ్రమ లేకపోవటం వంటి అనేక కారణాలు మనలను కీళ్ళ వ్యాధుల గ్రస్తులను చేస్తున్నాయి. అయితే కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు దీని నుండి ఉపశమనం పొందాలంటే ఆహారం విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే కీళ్ళవాతానికి సూపర్ గా పని చేసే ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. కీళ్ళవాతం తగ్గించే ఆహారాలు కీళ్ల నొప్పులను తగ్గించే ఆహారాలలో మనం ఆకు కూరలను చెప్పుకోవచ్చు. ఆకు కూరలు కీళ్ళ నొప్పుల నుండి మనకు ఉపశమనం కలిగిస్తాయి. మన ఎముకలను బలోపేతం చేస్తాయి. ఇక పప్పులు, ధాన్యాలు కూడా కీళ్ళ నొప్పులను తగ్గించటంలో కీలకంగా పని చేస్తాయి. పప్పులు, ధాన్యాలలో అధికంగా ప్రోటీన్లు, ఫైబర్ ఉండటం వలన ఇవి కండరాలకు కావలసిన పోషకాలను అందిస్తాయి. వాటి పనితీరు మెరుగుగా ఉండేలా చేసి వాపులు, నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. "నిత్యం యవ్వనంగా, అందంగా ఉండాలంటే ఇవి గుప్పెడు తినండి" కీళ్ళనొప్పులు తగ్గే ఆహారాలలో చేపలు ఇక కీళ్ళ వాతం తగ్గాలంటే, కీళ్ళ నొప్పుల నుండి ఉపశమనం కలగాలంటే చేపలు ఎంతో బాగా పని చేస్తాయి. సాల్మన్ సార్డినెస్, మాకేరెల్, ట్యూనా చేపలలో ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ అధికంగా ఉండడం వల్ల ఇవి జాయింట్ పెయిన్స్ ను తగ్గిస్తాయి. ఈ చేపలు తింటే కాస్త కీళ్ళ వాతం నుండి ఉపశమనం లభిస్తుంది. ఇవి తింటే కీళ్ళ నొప్పుల నుండి ఉపశమనం కీళ్ళ వాతంతో బాధ పడేవారు ముఖ్యంగా చికెన్, మటన్ తక్కువ తింటే మంచిది. అంతేకాదు దుంప కూరలు, పులుసు కూరలు తక్కువ తినాలి. ఇక కీళ్ళ వాతంతో బాధ పడేవారు బెర్రీలు ఎక్కువ తినాలి. స్ట్రాబెర్రీలు, రాస్బెర్రీలు, బ్లూబెర్రీల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను వాపులను తగ్గిస్తాయి. బొత్స ఎబ లోకేష్ , పయ్యావుల కేశవ్  వీటిని తింటే కీళ్ళ నొప్పులు తగ్గుతాయి కీళ్ల నొప్పులను తగ్గించే వాటిలో డ్రై ఫ్రూట్స్ చాలా బాగా పని చేస్తాయి. డ్రై ఫ్రూట్స్ లో ఉండే పోషకాలు యాంటీ ఇంఫ్లమేటరీ గుణాలు ఉండటం కారణంగా ఇవి మన కీళ్ళ నొప్పులను తగ్గిస్తాయి. అంతేకాదు కండరాలు, ఎముకల బలానికి కావాల్సిన పోషకాలను ఇస్తాయి. "ఆడవాళ్లు వేగంగా బరువు ఎందుకు పెరుగుతారో తెలుసా?" ఆహారంలో వీటిని తీసుకుంటే కీళ్ళవాతం ఉన్నవారికి మేలు కీళ్ళ వాతం తగ్గటానికి పసుపు కూడా చాలా ఉపయోగపడుతుంది. పసుపు యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతో పాటు వాపును తగ్గించే లక్షణాలు కలిగి ఉంటుంది. కీళ్లనొప్పి, కండరాలు పట్టేయడం, వాపులను తగ్గించడంలో ఇది ఎంతో బాగా ఉపయోగపడుతుంది. ఇక కీళ్ళ నొప్పులను తగ్గించటంలో అల్లం కూడా కీలకంగా ఉపయోగపడుతుంది. కీళ్ళ వాతం ఉన్నవారు ఆహారాలలో విషయంలో జాగ్రత్త తీసుకుంటే కీళ్ళ నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది. .

# ప్యాషన్ ఫ్రూట్స్ గురించి మీకు తెలుసా..? వీటిలో ఆ విటమిన్స్ పుష్కలంగా ఉంటాయ్..

శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో పండ్ల పాత్ర ఎనలేనిది. ఇవి కేవలం విటమిన్లతో నిండి ఉండటమే కాకుండా వివిధ రకాల జబ్బుల బారిన పడకుండా మనల్ని కాపాడుతూ ఉంటాయి. ఫ్రూట్స్ అనగానే ఆపిల్, దానిమ్మ, మామిడి, అరటి వంటి రోజువారీ పండ్లు గుర్తుకు వస్తాయి. అయితే వీటికి భిన్నంగా వేలాది రకాల పండ్లు ఉన్నాయి. వాటిలో కొన్నింటి గురించి మనకు తెలియదు కూడా. అటువంటి వాటిలో ఒకటే ప్యాషన్ పండు. ప్యాషన్ ఫ్రూట్ మందంగా, ముడతలతో కూడి ఉంటుంది. దక్షిణ అమెరికాలో పుట్టిన ఈ ఫలం ఇతర ప్రాంతాల్లోనూ పెరుగుతుంది. ఇది రుచికరంగానే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగకరమని వైద్యులు చెబుతున్నారు. దీనిలోపల జెల్లీ తరహా గుజ్జు మరియు గింజలు ఉంటాయి. కొందరు వివిధ వంటకాలలోనూ విరివిగా వినియోగిస్తారు. పండుగా తినడంతో పాటు జ్యూస్, డెసర్ట్‌లలో జోడించడాన్ని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. "నిత్యం యవ్వనంగా, అందంగా ఉండాలంటే ఇవి గుప్పెడు తినండి" విటమిన్ అతో నిండి ఉండే ప్యాషన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని రక్త నాళాలు, మృదులాస్థి, కండరాలు మరియు కొల్లాజెన్‌కు దన్నుగా నిలుస్తాయి. చర్మాన్ని యవ్వనంగా ఉంచడంతో పాటు శరీర రుగ్మతలను సమర్థవంతంగా నయం చేస్తుంది. వాపును తగ్గిస్తూ, కణాలు దెబ్బతినకుండా కాపాడుతుంది.



తగినంత విటమిన్ అ అందిస్తూ జలుబు మరియు కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. ప్యాషన్ ఫ్రూట్ గుజ్జు మరియు కరకరలాడే గింజలు రోజువారీ అవసరమైన విటమిన్ ంలో 8 శాతాన్ని కలిగి ఉంటాయి. ఆరోగ్యకరమైన కళ్లు మరియు కణాలు, పునరుత్పత్తి, రోగనిరోధక శక్తికి ఇది ఎంతో అవసరం. ఫైబర్ సమృద్ధిగా ఉండే ఈ పండు ప్రేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. కొలెస్ట్రాల్, మధుమేహం, గుండె జబ్బులు మరియు పలు రకాల క్యాన్సర్‌లు వచ్చే ప్రమాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. ఈ పండు రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా డైటరీ ఫైబర్ ఎక్కువ ఉండటంతో జీర్ణక్రియ మెరుగుదలకు మద్దతు ఇస్తుంది. వీటికి అదనంగా ప్యాషన్ ఫ్రూట్‌లో గుండె ఆరోగ్యానికి మేలు చేసే యాంటిఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం మరియు ఫోలేట్‌లను కూడా ఇది అందిస్తుంది. మూత్రపిండాలు, నరాలు, కండరాలు మరియు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతుంది. "అన్ని రోగాలకు దివ్యౌషధం ఈ ఆకు... తెలిస్తే అసలు వదిలిపెట్టరు" పండు మాత్రమే కాకుండా సీడ్స్ కూడా పలు కీలక పోషక విలువలను కలిగి ఉన్నాయి. ఫైబర్, ప్రోటీన్, ఖనిజ లవణాలతో పాటు హృదయారోగ్యానికి దన్నుగా నిలిచే కొవ్వులు వీటిలో ముఖ్యమైనవి. రక్త నాళాలను విశాల పరచడంలో ఈ ఫ్రూట్ ఎంతగానో సహాయపడుతుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ఇంత ఆరోగ్యకరమైన పండు తినేటప్పుడు జాగ్రత్త వహించడం కూడా ముఖ్యం. ఎందుకంటే వీటిలో పల్ప్‌లో సైనోజెనిక్ గ్లైకోసైడ్ అనే పదార్థం ఉంటుంది. ఇది సహజ టాక్సిన్ కాగా ఎక్కువ మోతాదులో సైనెడ్‌ను కలిగి ఉంటుంది. కాబట్టి చిన్న, పూర్తిగా పండని ఫ్రూట్స్ తినడం సురక్షితం కాదు.

# జుట్టు ఊడిపోకుండా ఉండాలంటే ఇలా చేయండి!

జుట్టు ఊడిపోతోందంటే ఎవరికైనా ఎంతో బాధగా ఉంటుంది. వేల రూపాయలు, లక్షల రూపాయలు నష్టపోయినా అంత బాధపడరుకానీ ఒక్క వెంట్రుక ఊడిపోయినా రాజ్యాలు పోయినంత బాధ కలుగుతుంది. పురుషులకైనా, స్త్రీలకైనా ఈ తరహా ఆలోచనలే ఉంటాయి. ఎవరికివారు జుట్టు ఊడిపోకుండా ఉండేందుకు, ఒత్తుగా పెరిగేందుకు అనేకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. జుట్టు ఊడిపోకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా విటమిన్లు ం, అ, ఇ, బయోటిన్, ఇనుము, జింక్ లాంటివి జుట్టు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి. శరీరానికి నీరు అవసరమైనంతగా జుట్టుకు కూడా నీరు అవసరం పడుతుంది. రోజుకి 8-10 గ్లాసుల నీరు తాగడం మంచిది. వ్యాయామం శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఫలితంగా జుట్టుకు అవసరమైన పోషకాలు సరైన మొత్తంలో అందుతాయి. నిద్ర లేకపోవడం వల్ల జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుంది. బాగా నిద్ర పోవాలి. మనోవేదన, ఒత్తిడి వల్ల జుట్టు రాలడం పెరుగుతుంది. యోగా, మెడిటేషన్ లాంటివి చేయడం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చు. "నిత్యం యవ్వనంగా, అందంగా ఉండాలంటే ఇవి గుప్పెడు తినండి" జుట్టు సంరక్షణ మృదువైన షాంపూ, కండిషనర్ ఉపయోగించండి: సల్ఫేట్స్, పారబెన్స్ లేని మృదువైన షాంపూ, కండిషనర్ మంచివి. రోజూ తలస్నానం చేయడం వల్ల జుట్టు పొడిబారడం, రాలడం జరుగుతుంది. తడి జుట్టును బాగా ఆరబెట్టుకోకపోతే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. హెయిర్ డ్రైయర్, స్ట్రెయిటెనర్, కర్లింగ్ ఐరన్ లాంటివాటిని తరచుగా ఉపయోగించడం వల్ల జుట్టు దెబ్బతింటుంది. పర్మ్, కలర్ లాంటి కెమికల్ ట్రీట్‌మెంట్స్ జుట్టును దెబ్బతీస్తాయి. తలకు మర్దన చేసుకోవడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఆలివ్ ఆయిల్, నారింజ పండు రసం లాంటి వాటితో మర్దన చేసుకోవచ్చు. జుట్టును గట్టిగా కట్టుకోవడం వల్ల కూడా జుట్టు రాలడం పెరుగుతుంది. అంతేకాకుండా జన్యువులు, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం, ఒత్తిడి, అనారోగ్యం, కొన్ని మందులు, తలకు ఇన్ఫెక్షన్లు, హెయిర్ స్టైలింగ్, కెమికల్ ట్రీట్‌మెంట్స్ వంటివాటివల్ల కూడా జుట్టు ఊడుతుంటుంది. జుట్టు పెరుగుదలకు బాదం, గుమ్మడికాయ విత్తనాలు, చియా సీడ్స్, అవకాడో, గుడ్లు, పాలకూర, బ్రోకలీ, క్యారెట్, టమాటా లాంటివి తీసుకోవాలి.



# ఆడవాళ్లు వేగంగా బరువు ఎందుకు పెరుగుతారో తెలుసా?

ఆడవాళ్లు వేగంగా బరువు పెరగడానికి అనేక కారణాలు ఉంటాయి. ఈ కారణాలు జీవన శైలి, హార్మోన్ల మార్పులు, ఆహారపు అలవాట్లు, వైద్య సంబంధిత పరిస్థితుల వలన కలగవచ్చు. ఇవి ఒక్కో వ్యక్తిలో ఒక్కో విధంగా ఉంటాయి, కానీ సాధారణంగా వేగంగా బరువు పెరగడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. ఆడవాళ్లు వేగంగా బరువు పెరగడానికి కారణాలు 1. హార్మోన్ల మార్పులు బరువు పెరగడానికి ప్రధాన కారణాల్లో హార్మోన్ల మార్పులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ఎస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్, థైరాయిడ్ వంటి హార్మోన్లలో మార్పులు శరీరంలో కొవ్వు నిల్వలను ప్రభావితం చేస్తాయి. మెటాబాలిజం మందగించడం, శరీరంలో నీటి నిల్వలు పెరగడం వంటివి కూడా హార్మోన్ల కారణంగా బరువు పెరగడానికి దోహదం చేస్తాయి. "ఊఎటవతీజీఏజీట: వంకాయ కర్రీలో పురుగు.. ఇక మీరు మారరా ..!" 2. జీవన శైలి మార్పులు ఆహారం లేదా తీయని పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా బరువు పెరుగుతుంది. అలాగే వ్యాయామం తగ్గించడం లేదా పనితీరు తగ్గడం కూడా జీవన శైలిలోని మార్పులు కారణంగా కావచ్చు. దైనందిన వ్యాయామం లేకుండా సేదతీరే జీవన శైలికి అలవాటు పడటం వల్ల, శరీరం వేగంగా కొవ్వును చేరదీస్తుంది. 3. అనారోగ్య కారణాలు పీసీఓఎస్ (ఖనీశ్రీఎఇఎబబితిఇ ాలజీతీఎ ాఎనిటతీనీఎవ) వంటి వ్యాధుల కారణంగా బరువు పెరగడం జరుగుతుంది. ఇది ఆడవాళ్లలోని హార్మోన్ల సమతుల్యాన్ని నాశనం చేస్తుంది. పీసీఓఎస్‌తో బాధపడుతున్న వారిలో ఇన్సులిన్ స్థాయిలు పెరిగి, శరీరంలో కొవ్వు నిల్వలు అధికమవుతాయి. అదేవిధంగా హైపోథైరాయిడిజం వంటి థైరాయిడ్ సమస్యలు కూడా బరువు పెరగడానికి కారణం కావచ్చు. "ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌లో వండిన అన్నం తింటున్నారా? " 5 5 4. గర్భధారణ, ప్రసవం గర్భధారణ సమయంలో శరీరంలో జరిగిన మార్పులు, తదుపరి కొంతకాలం బరువు పెరిగే పరిస్థితికి దారితీస్తాయి. గర్భధారణ సమయంలో శరీరం కొవ్వును నిల్వ చేస్తుంది. ప్రసవం తర్వాత ఈ బరువు తగ్గడం కొంత కష్టంగా ఉంటుంది. 5. ఆహారపు అలవాట్లు తీయని పదార్థాలు, జంక్ ఫుడ్, క్యాలరీలతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా బరువు వేగంగా పెరుగుతుంది. అధిక కేలరీలు తీసుకోవడం , పోషక విలువలు తక్కువగల ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరం కొవ్వును నిల్వ చేస్తుంది. ఈ అలవాటు నిరంతరంగా కొనసాగితే, శరీరం వేగంగా బరువు పెరుగుతుంది. 6. ఒత్తిడి , నిద్రలేమి ఒత్తిడి సమయంలో కార్టిసోల్ అనే హార్మోన్ విడుదల అవుతుంది, ఇది ఆహారాన్ని అధికంగా తీసుకునే విధంగా ప్రభావితం చేస్తుంది. అలాగే, నిద్ర సరిగా లేకపోవడం కూడా హార్మోన్ల సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. నిద్రలేమి వల్ల శరీరం శక్తిని కోల్పోతుంది, దాన్ని పునరుద్ధరించుకోవడం కోసం అధిక క్యాలరీలు అవసరమవుతాయి. "ఊఎటవతీజీఏజీట: వామ్మో బొద్దింకలు.. రెస్టారెంట్లలో దారుణ పరిస్థితులు..!" 7. వయస్సు వయసు పెరిగే కొద్దీ మెటాబాలిజం తగ్గుతుండటం వల్ల బరువు పెరుగుతుంది. వయసు పెరిగేకొద్దీ శరీరంలోని కొవ్వు పదార్థాలు ఎక్కువగా నిల్వవుతాయి, శక్తి తక్కువగా ఖర్చవుతుంది.



# సినిమా



## హరిహర వీరమల్లు కోసం అభిమానుల ఉత్కంఠ

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఓవర్సీస్‌లో కొన్ని ప్రాంతాల్లో టికెట్ బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. తాజాగా అక్కడ ఓ టికెట్ బుకింగ్ ఎ÷-లాట్‌ఫామ్ దీని రన్-టైమ్ 2.40 గంటలుగా పేర్కొంది. దీంతో ఈ రన్‌టైమ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో పవన్ సరసన నిధి అగర్వాల్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె అభిమానులతో చిట్‌చాట్ చేస్తూ.. ఈ సినిమాలో ఏ సన్నివేశం ఎక్కువ ఆసక్తికరంగా ఉంటుందో చెప్పారు. ఇంటర్వెల్, పోస్ట్ ఇంటర్వెల్, -క్లైమాక్స్‌లోని సన్నివేశాలు మరింత ఆసక్తిగా ఉంటాయని వెల్లడించారు. దీని విడుదల కోసం ఎదురుచూస్తున్నట్లు- తెలిపారు. 'హరి హర వీరమల్లు' తనకు దేవుడిచ్చిన బహుమానమని అన్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏఎం రత్నం నిర్మించిన ఈ చిత్రంలో వీరమల్లు అనే పోరాటయోధుడి పాత్రలో పవన్ కనిపించనున్నారు. ఈ మూవీ రెండు భాగాలుగా రానుంది. ధర్మం కోసం యుద్ధం అంటూ 'హరి హర వీరమల్లు: స్వోర్డ్ అండ్ స్పిరిట్' పేరుతో మొదటి భాగం సిద్ధమైంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది.






## యూఎస్‌లో అట్లీ, అల్లు అర్జున్ సినిమా

### విలన్‌గా హాలీవుడ్ నటుడువిల్ స్మిత్ అంటూ ప్రచారం



పుష్ప 2 ది రూల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురు చూస్తున్న అభిమానులకు బన్నీ సూపర్ అప్‌డేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. తమిళ దర్శకుడు అట్లీతో తన తదుపరి సినిమా చేస్తున్నాడు అల్లు అర్జున్. ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. ఈ మూవీ షూటింగ్ దాదాపు అమెరికాలో జరుపుకోబోతుంది. ఇప్పటికే అల్లు అర్జున్‌తో పాటు దర్శకుడు అట్లీ-చిత్రయూనిట్ మొత్తం అమెరికాకు చేరుకుంది. ఈ సినిమాలో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. విలన్ రోల్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో హాలీవుడ్ స్టార్ నటుడు విల్ స్మిత్‌ను విలన్‌గా తీసుకుబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే అల్లు అర్జున్ సినిమా పాన్ ఇండియా నుంచి ఇంటర్‌నేషనల్ వరకు వెళుతుంది. కాగా ఈ విషయంపై చిత్రబృందం నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ మూడు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం.

## గుమ్మడి నటనకు ఎవరైనా ఫిదా కావాల్సిందే


### నేడు జయంతి సందర్భంగా సంస్మరణ


చిన్న వయసులోనే బరువైన పాత్రలు పోషించారు. పాజిటివ్, నెగిటివ్ క్యారెక్టర్ ఏదైనా అందులో జీవించాల్సిందే. లీడ్ రోల్ అయినా అతిథి పాత్రైనా.. ఆ సినిమాపై తనదైన ముద్ర వేయాల్సిందే. అతను ఎవరో కాదు గుమ్మడి వెంకటేశ్వర్ రావు. ఏ పాత్ర అయినా అలవోకగా చేసే గుమ్మడి నటన అందరికీ గుర్తుండిపోయింది. ఇవాళ గుమ్మడి జయంతి సందర్భంగా ఆయనను ఓసారి గుర్తు చేసుకుందాం. గుమ్మడి వెంకటేశ్వరరావు 1927 జూలై 9న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా రావికంపాడు గ్రామంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. గుమ్మడి వెంకటేశ్వరరావుకు బాల్యం నుంచీ ఏదో ఒక వైవిధ్యం ప్రదర్శించాలనే తపన ఉండేది. యన్టీఆర్ తమ ఎన్.ఎ.టి. సంస్థ నిర్మించిన చిత్రాలలో మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు. అలా రామారావు సొంత చిత్రాలు పిచ్చి పుల్లయ్య, తోడుదొంగలు, జయసింహ లో గుమ్మడి కీలక పాత్రలు పోషించారు. ఆ తరువాత గుమ్మడి మరి వెనుదిరిగి చూసుకోలేదు. 'తోడుదొంగలు'లో గుమ్మడి వయసు మీరిన పాత్ర ధరించడం చూసిన పి.పుల్లయ్య తన 'అర్ధాంగి' చిత్రంలో ఏయన్నార్, జగ్గయ్యకు తండ్రిగా నటించే పాత్రను ఇచ్చారు. తన కన్నా వయసులో పెద్దవారయిన నటులకు తండ్రిగా నటించడంతో అప్పటి నుంచీ గుమ్మడికి అధికంగా తండ్రి పాత్రలే పలకరించసాగాయి. ఒకే రకం పాత్రలు ధరించినా, వాటిలో తనదైన బాణీ ప్రదర్శించడానికి గుమ్మడి ప్రయత్నించేవారు. అనేక విలక్షణమైన పాత్రల్లో సలక్షణంగా నటించిన గుమ్మడికి 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రం ఎనలేని పేరు సంపాదించి పెట్టింది. ఈ చిత్రం ద్వారా ఆయనకు రాష్ట్రపతి బహుమతి కూడా లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. రాష్ట్రప్రభుత్వం 'రఘుపతి వెంకయ్య అవార్డు'తో గౌరవించింది. సాత్వికాభినయంలో తనకు తానే సాటి అనిపించుకున్న గుమ్మడి పేరు తలచుకోగానే ఆయన ధరించిన అనేక వైవిధ్యమైన పాత్రలు మన కళ్ళ ముందు కదలాడుతూ ఉంటాయి. గుమ్మడి తన చివరి రోజుల్లో చిత్రసీమలో తన అనుభవాలను తీపి జ్ఞాపకాలు- చేదు గుర్తులు' పేరుతో రాసుకున్నారు. 2010 జనవరి 26న గుమ్మడి తుదిశ్వాస విడిచారు. తెలుగు చిత్రసీమ చూసిన మహానటుల్లో గుమ్మడి పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది. నవతరం ప్రేక్షకులు సైతం గుమ్మడి మెథడ్ యాక్టింగ్ చూసి ముగ్ధులవుతున్నారు..




## రాజమౌళి..మహేశ్ బాబు కాంబో

### సినిమాపై కనిపించని ప్రచారం





రాజమౌళితో సినిమా చేస్తున్న హీరోలు మధ్యలో మరో ప్రాజెక్ట్ చేయకూడదు. ఇది జక్కన్న మొదటి రూల్. బాహుబలి సమయంలో ప్రభాస్, ఆర్ఆర్ఆర్ సినిమా చేస్తున్నప్పుడు ఎన్టీఆర్, రామ్ చరణ్ మరో సినిమా చేయలేదు. కాకపోతే గెస్ట్ రోల్ అని చెప్పి జక్కన్న దగ్గర స్పెషల్ పర్మిషన్ తీసుకొని ఆచార్య చేశాడు చరణ్. ఇప్పుడు ఎస్ఎస్ఎంబి29 కోసం మహేశ్ బాబు బల్క్ డేట్స్ ఇచ్చేశాడు. ఈ సినిమా తప్పితే మరో సినిమా చేయడం లేదు. అంతే కాకుండా ఈ సినిమాకు సంబంధించి బయట ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు మహేశ్ బాబు. కానీ మిగతా స్టార్స్ మాత్రం రాజమౌళి రూల్స్ బ్రేక్ చేస్తున్నట్టే కనిపిస్తోంది. మహేశ్‌బాబు తప్ప ప్రియాంక చోప్రా, పృద్వీరాజ్ సుకుమారన్ సమయం వచ్చినప్పుడల్లా మూవీ మాట్లాడుతునే ఉన్నారు. తాజాగా ప్రియాంక చోప్రా మహేశ్‌బాబు సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. 'ప్రస్తుతం హాలీవుడ్ సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నా. కానీ ఇండియాను, హిందీ సినిమాలను చాలా మిస్ అవుతున్నాను. అప్పుడప్పుడు నా సొంత ఇంటికి దూరమయ్యాననే భావన కలుగుతుంటుంది. కానీ ఇప్పుడు ఓ ఇండియన్ ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఆ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చారు. గతంలో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా పలు సందర్భాల్లో ఎస్ఎస్ఎంబీ 29 గురించి మాట్లాడారు. రాజమౌళి సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. దాని గురించి ఇప్పుడేం మాట్లాడలేనని అన్నారు. కానీ తాను ఈ సినిమాలో ఏడాది క్రితమే భాగమయ్యాను. అప్పటినుంచి ఈ ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నానని తెలిపారు. కానీ మహేశ్ బాబు మాత్రం జక్కన్న గీసిన గీత దాటడం లేదు. ఎస్ఎస్ఎంబీ 29 గురించి బాబు మాట్లాడిన సందర్భాలు లేవు. లుక్ విషయంలోను లీక్ కాకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించాడు. విదేశాల్లో -ట్రైనింగ్‌కు వెళ్లినా కూడా ఎలాంటి లీకేజీ బయటికి రానివ్వలేదు. పూజా కార్యక్రమాలు జరుపుకున్నా, షూటింగ్ మొదలైనా కూడా ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పిన రాజమౌళినే చెప్పాలి అన్నట్టు-గా.. ఫుల్ స్ట్రిక్ట్‌గా ఉంటున్నాడు మహేష్. కానీ ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుంచి.. ఏదో ఓ రకంగా ఇండైరెక్ట్‌గా పోస్ట్‌లు పెడుతునే ఉన్నారు, మాట్లాడుతునే ఉన్నారు. దానికి తోడు లీకేజీలు వదలడం లేదు. ఇప్పటి వరకు రాజమౌళి ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పింది ఏమైనా ఉందా అంటే? ఆ మధ్య సింహాన్ని బోనులో బంధించానని, మహేష్ బాబు పాస్‌పోర్ట్ లాక్కున్నాను అంటూ పోస్ట్‌లు చేశాడు.

# 'సైలెన్స్ ఫర్ గాజా'కు జెవివి మద్దతు

## ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా డిజిటల్ నిరసనలో భాగమవ్వాలని జెవివి పిలుపు

విశాఖపట్నం(విజయ సారథి):గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న "సైలెన్స్ ఫర్ గాజా' డిజిటల్ నిరసనకు జెవివి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. కృష్ణారావు, వై.ఎ.ఆర్.కె.ప్రసాద్లు బుధవారం (తేది. 09.07.2025) పత్రికా ప్రకటన విడుదల చేశారు.గాజాలో జరుగుతున్న మారణహోమాన్ని జెవివి ఖండిస్తున్నది. బహుళజాతి సంస్థలు, కంపెనీలు తమ స్వప్రయోజనాల కోసం గాజాను నామరూపాల్లేకుండా చేయాలనే లక్ష్యంతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వేలాదిమంది అమాయకులైన చిన్నారులు, మహిళలు, సామాన్యులు ఈ యుద్ధంలో బలవుతున్నారని తక్షణమే ఈ దౌర్జన్యకాండను ఆపేలా ప్రజలందరూ ఎలుగెత్తి తమ నిరసనను డిజిటల్ వేదికగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్దేశిత సమయంలో ప్రతీ రోజు ఒక అరగంట పాటు మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేయటమనేది ఒక చిన్న చర్యే అయినా. ఇది నిఘా ఆధారిత వ్యాపార ధోరణులకు, ఇజ్రాయిల్ దౌర్జన్యానికి వ్యతిరేంగా ఉన్నతమైన ప్రతిఘటన. ఈ డిజిటల్ నిరసనలో దేశవ్యాప్తంగా ప్రజలందరూ చురుకుగా పాల్గొనాలి. నిరసన సమయంలో మొబైల్ ఫోన్లను ప్రతిరోజూ రాత్రి 9 గంటల నుండి 9.30 గంటల వరకు స్విచ్ ఆఫ్ చేయాలనీ, ఏ సోషల్ మీడియా ప్లాట్ఫామ్లోనైనా పోస్ట్ చేయటం, లైక్ చేయటం, వ్యాఖ్యానించటం వంటివి చేయవద్దని, గాజా ప్రజల పక్షాన నిలబడటానికి, యుద్ధ నేరాలను ఖండించేందుకు ప్రతి ఒక్కరూ ఈ మౌన నిరససనలో భాగస్వాములు కావాలని జెవివి పిలుపునిచ్చింది.

# బాధ్యతలు చేపట్టిన బిజెపి అధ్యక్షుడు మాధవ్

## లెనిన్ సెంటర్‌ను విశ్వనాథ సెంటర్‌గా మార్చాలని డిమాండ్

విజయవాడ,జూలై9: భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి భాజపా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. లెనిన్‌సెంటర్‌లో విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లెనిన్‌సెంటర్ పేరు మార్చి విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలని ఈ సందర్భంగా మాధవ్ డిమాండ్ చేశారు. భారత దేశానికి ఎలాంటి సంబంధం లేనప్పుడు లెనిన్ పేరు పెట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. ఇటీవలే మాధవ్ బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దగ్గుబాటి పురంధేశ్వరి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాధవ్‌కు పార్టీ సీనియర్ నేతలు దగ్గుబాటి పురందేశ్వరి, సోము వీర్రాజు, సత్యకుమార్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

# సింగరేణిలో సమ్మెకు దిగిన కార్మికులు

గోదావరిఖని,జూలై9: నూతన కార్మిక చట్టాలు, ప్రైవేటీకరణ చర్యల్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కార్మికులు సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా బెల్లంపల్లి పరిధిలో సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. గనుల్లో స్వచ్ఛందంగా విధులు బహిష్కరించారు. మందమర్రిలోనూ సింగరేణి కార్మికులు విధులకు వెళ్లలేదు. కేకే-5 గనిపై ఐకే సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మక చట్టాలను బలోపేత చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కరోజు కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో సంస్థకు రూ.76 కోట్ల నష్టం వాటిల్లిందని సమాచారం. సింగరేణి సమ్మె కారణంగా గనుల్లో ఉత్పత్తి నిలిచి పోయింది.

# కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం

## భగ్గుమన్న కార్మిక సంఘాలు

క్నూలు,జూలై9:పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదు అంటూ కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఎర్రజెండాల చేతబూని నిర్వహించిన ప్రదర్శన ఆదోని వీధులు ఎరుపెక్కాయి. పట్టణంలోని అనంత మంగళం స్వామి ఆలయం నుండి సిఐటియుసి, ఏఐటీ-యూసీ, ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో సాగిన ర్యాలీలో మా కోరికలు న్యాయమైన అంటూ అంగన్వాడీలు ఆశ వర్కర్లు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు ఐఎఫ్టియు నాయకులు మల్లికార్జున మాట్లాడారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీ-కరణ చేయడం వల్ల ఉద్యోగులు నష్టపోతారన్నారు స్కీం లో పనిచేసే కార్మికులకు గుర్తించి కలిసి వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దుచేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు తిప్పన గోపాల్ రామాంజనేయులు వీరారెడ్డి ఏఐటియుసి నాయకులు వెంకప్ప ఐ ఎఫ్ టి యు నాయకులు వెంకప్ప, మణి నాయకులు ఈరన్న వీరేష్ లక్ష్మణ్ లింగన్న అజీమ్ ఖాన్ వీరేష్ , కృష్ణమూర్తి, సుదర్శన్, వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, అంగన్వాడి నాయకురాళ్లు వెంకటమ్మ, వరలక్ష్మి, సోమక్క, గీత, శారద ,జానకి, లక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్ళు సుకన్య లావణ్య లతా రాజేశ్వరి ఆటో యూనియన్ నాయకులు హనుమంతు తదితరులు ఉన్నారు.





# అభివృద్ధి విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై అధికారులు దృష్టి సారించండి

## బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శిలను గుర్తించాలి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల(విజయ సారథి):స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు విశేష కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ ఎస్ హాల్ నందు కలెక్టర్ అధ్యక్షతన స్వర్ణాంధ్ర-2047 నియోజక వర్గ విజన్ యాక్షన్ ప్లాన్, జీరో పావర్టీ - పి 4 మార్గదర్శి - బంగారు కుటుంబం మోడల్ సర్వే పై జిల్లా, నియోజక వర్గ యాక్షన్ ప్లాన్ టీములు, ఎమినెంట్ పర్సన్స్, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇండస్ట్రీ, పంచాయతీ శాఖ, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి కోసం విద్యా, వ్యవసాయం, పాడిపరిశ్రమాభివృద్ధి, అలాగే వివిధ రంగాలలో దృష్టి సారించాల్సిన తీసుకోవాల్సిన చర్యలపై ఎమినెంట్ ప్రతినిధులు సమావేశంలో చర్చించి పలు సూచనలు సలహాలు తెలియజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యమై గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు చేయి చేయి కలిపి పనిచేస్తే తప్పకుండా స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధ్యమవుతుందన్నారు.పి-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్షిప్) మోడల్ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరుగుతోందని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించేందుకు ఈ సర్వే చేపట్టడం జరుగుతోందన్నారు. పేదరికంతో దిగువన ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబముగా భావిస్తూ వారికి చేయూతనిచ్చే వారిని మార్గదర్శులుగా గుర్తింపునిస్తూ ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వం కార్యాచరణ నిర్దేశించిందని ఈ దిశగా మన జిల్లాలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమం మరింత వేగవంతం చేయాలన్నారు.జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శుల ఎంపిక ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మన జిల్లాలో వివిధ రంగాలలో సంపద సృష్టించేందుకు అనేక వనరులు ఉన్నాయని వీటినివినియోగించుకొని సంపద సృష్టించే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు వారి ప్రాంతంలో ఉండే వనరులు వాటి వల్ల ఎలా సంపాద సృష్టించాలి అనే అంశాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సీపీఓ వేణుగోపాల్, ఆర్డిఓలు సి విశ్వనాథ్, నరసింహులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు సమ్మె బాట

## పలు జిల్లాల్లో ర్యాలీలు, మానవహారాల నిర్మాణం

## కేంద్రం తీరుపై కార్మిక సంఘాల మండిపాటు

విజయవాడ,జూలై9: కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు సమ్మె బాట పట్టాయి. లేబర్ కోడ్స్ చట్టాలను చీకట్లో తీసుకువచ్చిన మోడీ ప్రభుత్వానికి కార్మికుల జీవితం విలువ లేనిది అని అన్నారు. కనీస వేతన చట్టం చేయని ఈ ప్రభుత్వం ప్రస్తుతం ఎనిమిది గంటల పని సమయాన్ని 12 గంటలుగా పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని నాయకులు విమర్శించారు. విజయవాడలో కార్మిక సంఘాల భారీ ప్రదర్శన.. సమ్మెను ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి నాగేశ్వరరావు మాట్లాడారు. మోడీ సర్కార్ తీరును దుయ్యబట్టారు.కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మానవహారంలో 'మోడీ సారు' కార్మిక చట్టాలు రద్దు చేయాలని వినూత్న కళారూపం ప్రదర్శించారు. అయితే పోలీసులు మోడీ మాస్కును చించే ప్రయత్నం చేయగా, కార్మిక నాయకులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కార్మిక హక్కుల పై ప్రభుత్వాల దాడికి నిరసనగా కోట్ల మంది కార్మికులు దేశ వ్యాప్తంగా సమ్మెకు దిగారు. తాడేపల్లిలోసిపిఎం సినియర్ నాయకులు పి మధు పాల్గొన్నారు. కేంద్ర తీరును ఆయన ఎండగట్టారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో కొనసాగింది. జాతీయ సమ్మె సందర్భంగా ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన భారీ ప్రదర్శన జరిగింద. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల పారిశ్రామిక ప్రాంతంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ తీసారు. గోవిందరావు మాట్లాడుతూకేంద్రం తీరును దుయ్యబట్టారు. కార్మికులకు అన్యాయం చేస్తున్న చట్టాలను రద్దుచేయాలన్నారు. కార్మిక, ప్రజా సంఘాలు ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమ్మె సందర్భంగా విజయనగరంలో భారీ ర్యాలీ నిర్వహించి కదం తొక్కారు. బుధవారం స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, ఎంజీ రోడ్డు, గంటస్తంభం మీదుగా కన్యకాపరమేశ్వరి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. దేశవాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం అనంతపురం జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్లో అంగన్వాడీ ఆశ తదితర కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ఏర్పాటు- చేసిన మానవహారం నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట కచేరి సెంటర్లో మానవహారం, ర్యాలీ నిర్వహిహించిన ట్రేడ్ యూనియన్ నాయకులు కేంద్రం తీరును దుయ్యబట్టారు. చిత్తూరు సమ్మెలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులుకూడా పాల్గొన్నారు.

# తొలి అడుగులో..సమస్యల వెల్లువ

## మంత్రులు ఎక్కడికి వెళ్లినా సమస్యల ప్రస్తావన

## పరిష్కరించదగ్గవే అయినా నిర్లక్ష్యం తగదు

## సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే స్థానిక ఎన్నికల్లో దెబ్బ

అమరావతి,జూలై9 రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు పుంఖానుపుంఖాలుగా సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే. అయితే ఏ మేరకుచిత్తశుద్ధితో ముందుకు వెళతారన్నది ముఖ్యం. ఇటీవల వారసత్వ మార్పిడి విషయంలో వచ్చిన దరఖాస్తులే ఇందుకు నిరదర్శనం. ఈ సమస్య సరిష్కారం కోసం ప్రభుత్వం సక్సెసేషన్ కార్యక్రమం చేపట్టబోతున్నది. ఇందులో వంద రూపాయలకే తండ్రి నుంచి సంక్రమించిన హక్కులకు పట్టా లభించబోతున్నది. అలాగే ఇల్లు తదితర సమస్యలుకూడా ఇలాగే ఉన్నాయి. వీటిని కూడా పరిష్కరించాలని కోరుతున్నారు . సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే స్థానిక ఎన్నికల్లో తీవ్రప్రభావం చూపగలదు. దీనిని దృష్టిలో ఉంచుకునే టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి తొలి అడుగు కార్యక్రమాన్ని రూపొందించారని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఇళ్లు, ఇంటి స్థలాలు, తాగునీరు, వైద్యం, రోడ్లు, వ్యవసాయానికి సాయం వంటి అంశాలపైనే ఎక్కువగా వినతులు ఉన్నట్లు- నియోజకవర్గ ఇన్చార్జీలు చెబుతున్నారు. గైర్హాజరుకు అవకాశం లేకుండా ఇంటింటికీ నేతలు, కార్యకర్తలు వెళ్లాల్సిన సమయంలో ఎవరూ గైర్హాజరు కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రతి ఇంటికీ ఒక లోకేషన్ చొప్పున ఫీడ్ చేసిన ట్యాబ్లను నేతలకు ఇస్తున్నారు. ఒక ఇంటి పర్యటన పూర్తయిన తరువాతే మరో ఇంటి వివరాలు ట్యాబ్లో కనిపించేలా రూపకల్పల చేయడం విశేషం. అలాగే ఒక్కో ఇంటికి మూడు నిముషాల సమయం ఇస్తున్నారని, రోజుకు కనీసం 30 ఇళ్లకు వెళ్లేలా కార్యక్రమాన్ని రూపొందించారని తెలిసింది. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రతి ఎంఎల్ఎను ఇంటింటికి వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్దేశిరచారని చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రులతో పాటు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు క్షేత్రస్థాయికి వెళ్లాలని చంద్రబాబు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనికోసం పలువురు పార్టీ నేతలకు కూడా నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను, ఆ కుటు-ంబంలోని సభ్యుల ఫోటోలతో సహా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాష్బోర్డులో అప÷-లోడ్ చేయాలని సిఎం సూచించారు. అయితే, ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ప్రజల నుండి వినతుల వర్షం కురుస్తోందని టిడిపి నాయకులు చెబుతున్నారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతలు పెద్ద సంఖ్యలో అందిస్తుడటం టిడిపి నేతలకు కొంత ఇబ్బందికరంగా మారింది. స్థానిక ఎన్నికలు జరిగేలోగా వీటిని పరిష్కరించకపోతే, వినతులు ఇచ్చిన వారే మరో రకంగా స్పందించే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి వచ్చే ఏడాది ఆరంభంలోనే పంచాయితీలు, మండల పరిషత్, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. 2021లో ఈ విభాగాలకు ఎన్నికలు జరగ్గా, తిరిగి 2026 ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

# కార్పొరేట్ కంపెనీలకు దాసోహం

చీరాల,జూలై9: కార్మికులను బానిసలుగా మార్చి వారి హక్కులను హరించి కార్పొరేట్ కంపెనీ యజమానులకు లాభాలు చేకూర్చేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ చట్టాలను అమల్లోకి తీసుకు వస్తున్నాయని, వీటిని కార్మికులు అందరూ ఐక్యంగా ఉద్యమించి అడ్డుకోవాలని ఏపీ ఐ ఎల్ టి డి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మి అన్నారు. లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ కార్మికుల హక్కులను కాపాడాలని దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం చేపట్టిన ఏపీ ఫెడరేషన్ సిఐటియు, టి ఎన్ టి యు సి, ఐఎన్ టియుసి, వై ఎస్ ఆర్ టియుసి నాలుగు యూనియన్లు ఐక్యంగా స్వచ్ఛందంగా కలసి సమ్మెలో పాల్గొని చీరాల ఐటిసి వద్ద చేపట్టిన సమ్మెను విజయవంతం చేశారు. కార్మికులు సమ్మె ప్రభావంతో చీరాలలో ఐటిసి కంపెనీ మూతపడింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మంజూందర్ లు మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చేందుకు లేబర్ కోర్సు అమల్లోకి కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుంది అన్నారు. కార్మికులకు ఉన్న 44 చట్టాలను హరించి వాటిని నాలుగు చట్టాలుగా మార్చారు అన్నారు. యజమానులకు లాభాలు కలిగించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమల్లోకి తీసుకువస్తుందని ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కార్మికులందరూ ఐక్యంగా కలిసి పోరాటాలు చేయాలన్నారు. వంద సంవత్సరాల క్రితం కార్మిక సంఘాలు లేకపోయినప్పటికీ సమ్మె హక్కుతోపాటు- ఎనిమిది గంటల పని దినం సాధించగలిగాం అని అయితే

## మోడీ తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం

నేడు కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్లను తీసుకువచ్చింది అని అన్నారు. ఈ కోడ్ల అమలుతో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులన్నీ కోల్పోతారు అన్నారు. స్వాతంత్య్రం రాకముందే కార్మికులు విదేశీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణ త్యాగాలు చేశారు అన్నారు. లేబర్ కోడ్స్ చట్టాలను చీకట్లో తీసుకువచ్చిన మోడీ ప్రభుత్వానికి కార్మికుల జీవితం విలువ లేనిది అని అన్నారు.కనీస వేతన చట్టం చేయని ఈ ప్రభుత్వం ప్రస్తుతం ఎనిమిది గంటల పని సమయాన్ని 12 గంటలుగా పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. అనంతరం ఐటిసి వద్ద కార్మికులు ర్యాలీ నిర్వహించారు.అదేవిధంగా చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం వసంతరావు, ఏపీ ఫెడరేషన్ సిఐటియు,టిఎన్ టియుసి,ఐఎన్ టియుసి,వై ఎస్ ఆర్ టియుసి నాలుగు యూనియన్లు అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

# విశాఖలో అఖిలపక్ష కార్మిక సంఘాల భారీ ప్రదర్శన

## కార్మికులకునష్టం చేసేలా మోడీ విధానాలు

విశాఖపట్టణం,జూలై9:కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ,ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా విశాఖ నగరంలో అఖిలపక్ష కార్మిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేలాది మందితో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. దొండపర్తి డిఆర్ఎం కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ, సంఘం, శరత్ జంక్షన్, గురజాడ జంక్షన్, ఆసీలు మెట్ట జంక్షన్ మీదుగా సాగి జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరింది. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, అఖిలపక్ష కార్మిక సంఘాల జెఏసి చైర్మన్ ఎం.జగ్గు నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె. ఎస్.వి కుమార్, ఉక్కు పరిరక్షణ పోరాట సమితి చైర్మన్ లు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం. మన్మథరావు,ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుతరావు, సిఐఫ్ టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్. కనకారావు, ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశ్వర్లు,ఎపిఎఫ్ టియు జిల్లా కార్యదర్శి కె. దేవా, ఎఫిడబ్ల్యూజెఎఫ్ జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షులు పి.నారాయణ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కార్మికులకు నష్టం చేసే విధానాలను అవలంభిస్తుందని, సంపదనంతా కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని ఆరోపించారు. అందులో భాగంగా 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులకు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టు-కునే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే ప్రాథమికమైన హక్కులు కోల్పోతారని చెప్పారు.అందుకే ఈరోజు దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ సమ్మె జరుగుతుందన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట సమితి చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ,మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవలసిన సమయం వచ్చిందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడే మోడీ వంటి ప్రభుత్వం రాలేదని ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ పోరాట సమితి చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్,ఆటో వర్కర్స్, ఆశా, అంగన్వాడి, మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్, మధ్యాహ్న భోజన పథకం తదితర సంఘాల కార్మికులు, ముఖ్యంగా మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బంగారుపాళ్యం వద్ద జగన్ రాకతో ఉద్రిక్తత

## అనుమతికి మించి వచ్చిన వైకాపా శ్రేణులు రాక

## పోలీసు ఆంక్షలు ఉల్లంఘన...స్వల్పంగా లాఠీఛార్జ్

చిత్తూరు,జూలై9: వైకాపా అధినేత వైఎస్ జగన్ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటనను వైకాపా నేతలు ఎప్పటిలా బలప్రదర్శనకు వేదికగా మార్చారు. బుధవారం ఉదయం బెంగళూరు నుంచి అరగొండ ఫ్లై ఓవర్ వద్ద ఏర్పాటు- చేసిన హెలిప్యాడ్ వద్దకు జగన్ చేరుకున్నారు. అక్కడ 30 మందికి అనుమతి ఉండగా వందలాది మంది దూసుకురావడంతో తోపులాట జరిగింది. రోడ్ షో, ర్యాలీకి అనుమతి లేనప్పటికీ.. హెలిప్యాడ్ నుంచి మార్కెట్ యార్డు వరకు పెద్ద సంఖ్యలో వాహనాలతో రోడ్ షో నిర్వహించారు. ఆంక్షలు ఉల్లంఘించి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీఛార్జ్ చేశారు.




# జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం





విశాఖపట్నం(విజయ సారథి):అధికారులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గిరిజన ప్రాంతాల నుండి కేజిహెచ్ కి వచ్చే రోగులకు సరైనవైద్య సేవలు అందించాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి జల్లిపల్లి సుభద్ర వైద్యాదికారులను కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశము బుధవారం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, విద్య, వైద్య, ఆరోగ్య, త్రాగు నీటి సరఫరా, రహదారులు, పంచాయతి రాజ్ తదితర శాఖలలో జరుగుతున్న ప్రగతి పై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా కలక్టర్ హరేంధిర ప్రసాద్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలక్టర్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలక్టర్ విజయ్ కృష్ణన్, మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, అరకు శాసన సభ్యులు రేగటి మత్స్యలింగం, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, జడ్పీ సీఈవో నారాయణ మూర్తి,జెడ్ పిటిసిసి సభ్యులు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతంలో ప్రజలకు అత్యవసర వైద్యం కోసం కేజిహెచ్ కు వస్తారని, అలాంటి వారికి మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే ఏజన్సీ లో పనిచేసే వైద్యులకు, సిబ్బందికి మంచి సదుపాయాలు కలుగజేస్తే తప్పకుండా అక్కడి ఉండి పనిచేస్తారన్నారు. గిరిజన ప్రజలు కేజిహెచ్ లోని ఎస్.టి. సెల్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.సభ ప్రారంభమైన వెంటనే స్థాయి సంఘ సమావేశాలు, సర్వ సభ్య సమావేశాలు వేరు వేరుగా నిర్వహించాలని పలువురు సభ్యులు కోరగా వేరు వేరుగా నిర్వహిస్తామని చైర్ పర్సన్స్ తెలిపారు. శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ స్థాయి సంఘ సమావేశాలలో ఆమోదము పొందిన అంశాలను సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అరకు, అనంతగిరి హైడ్రో ప్రాజెక్ట్ వలన ఏజన్సీ ప్రాంతం ముప్పుకు గురవుతుందని పర్యావరణానికి, రైతులకు నష్టం వాటిల్లితుందని ఈ హైడ్రో ప్రాజెక్ట్ సర్వ్ వెంటనే నిలిపివేయాలని జెడ్ పిటిసి డి. గంగరాజు తో పాటు జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కొంతమంది సభ్యులు కోరగా దీనికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ సమాధానమిస్తూ అన్ని విషయములు పరిగణలోనికి తీసుకొని గ్రామ సభలు నిర్వహించి, తీర్మానాలు చేసిన తర్వాత మాత్రమె ముందుకు వెళ్ళడం జరుగుతుందనితెలిపారు. వ్యవసాయంపై సమీక్షలో ఉచిత విత్తనాలు అందించాలని విత్తనాలు ఎంపికపై రైతులు అవగాహన కల్పించాలని అన్నదాత సుఖీభవ, క్రాప్ ఇన్సురన్సు తదితర అంశములపై రైతులకు అవగాహన కల్పించాలని శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పలువురు సభ్యులు అధికారులను కోరారు. రైతులందరికీ సరిపడే విత్తనాలు ఉన్నాయని అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని అనకాపల్లి జిల్లా వ్యవశాయ శాఖాధికారి వివరించారు. గత ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ సర్వే కొనసాగుతుందా, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి తెలపాలని సభ్యులు కోరగా దీనికి విశాఖపట్నం జిల్లా కలక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రీ సర్వ్ కొనసాగుతుందని తక్కువ గ్రామాలని తీసుకొని 250 ఎకరాలు ఒక బ్లాక్ గా తీసుకొని రీ సర్వ్ జరుగుతుందని అన్నారు. రీ సర్వే సమస్యలు పరిష్కరించడానికి రెవిన్యూ సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తున్నదన్నారు. అసలు పట్టాదారులు ఎవరో భూమిని ఎవరు అనుభవిస్తున్నారో తెలిసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. గిరిజనులకు కెజిహెచ్ లో సరైన వైద్యం అందడం లేదని ప్రైవేటు వైద్య శాలలో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని సభలో కొయ్యూరు జెడ్ పిటిసి సభలో ప్రస్తావించగా పూర్తి వివరాలు ఇస్తే విచారణ చేస్తామని ప్రభుత్వ వైద్య శాలలతో పాటు ప్రైవేటు నెట్ వర్క్ ఆసుపత్రులలో ఎన్ టిఆర్ వైద్య సేవ పథకంలో ఉచితంగా వైద్యం పొందవచ్చునని కలక్టర్ చెప్పారు. కెజిహెచ్ లో ఎస్ టి సెల్ కూడా బాగా పనిచేస్తున్నారని, ఎస్ టి సెల్ సేవలు కూడా ఏజెన్సీ ప్రజలువినియోగించు కోవాలని సూచించారు. కెజిహెచ్ లో అందుతున్న సేవలు, ఓపి, ఇన్ పేషెంట్లు, ఆపరేషన్లు జరిగినవి సభ్యులకు తెలియజేయాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ నకు సూచించారు. డి.సి.హెచ్.ఎస్. (జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి) మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు పూర్తిస్థాయి సిబ్బందితో పనిచేస్తున్నాయని, అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ముఖ్యంగా, హెచ్.ఐ.వి.మందులు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.కె.జి.హెచ్. సూపరింటెండెంట్ మాట్లాడుతూ, కె.జి.హెచ్.లో అన్ని వైద్య సేవలు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుండె సంబంధిత చికిత్సలు, ఇతర అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.జిల్లాలో అంబులెన్సులు తక్కువగా ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తు తున్నాయని తెలియజేశారు. ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించాలని వారు కోరారు.ఈ సమస్యపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలక్టర్ స్పందిస్తూ, ప్రభుత్వం వారితో మాట్లాడి సీ.ఎస్.ఆర్. నిధుల నుండి త్వరలో అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అంబులెన్స్‌ల కొరతను తీర్చడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.జెడ్.పి.టి.సి. శ్రీమతి శెట్టి రోషిణి మాట్లాడుతూ, గిరిజన ప్రాంత వైద్యశాలల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉండేలా చూడాలని ఆమె కోరారు. అలాగే, ఈ వైద్యశాలల్లో పూర్తి స్థాయి నర్సులు సిబ్బందిని నియమించాలని కూడా ఆమె విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇది అత్యవసరమని ఆమె నొక్కి చెప్పారు.జెడ్.పి.టి.సి. అచ్చుతాపురం మాట్లాడుతూ, ఒకే ఇంటిలో వృద్ధులు ఉండి, అదే ఇంట్లో హెచ్.ఐ.వి.రోగి కూడా ఉంటే, వారికి ఒక్క పింఛను మాత్రమే ఇస్తున్నారని తెలియజేశారు. దీనివల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ సమస్యపై విశాఖపట్నం జిల్లా కలెక్టరు స్పందిస్తూ, హెచ్.ఐ.వి. రోగులకు మరియు వితంతు పింఛను లేదా వృద్ధాప్య పింఛను అర్హత ఉన్నవారికి విడివిడిగా పింఛన్లు ఇస్తారని స్పష్టం చేశారు. అటువంటి లబ్ధిదారులు ప్రాజెక్టు డైరెక్టరు, డి.ఆర్.డి.ఎ. వారినిగాని సంబంధిత మండల అధికారులనుగాని సంప్రదించాలని తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.జడ్.పి.టి.సి., అచ్చుతాపురం వారు మాట్లాడుతూ, అనకాపల్లి నుండి అచ్చుతాపురం రోడ్ల వెడల్పు పనులు సంవత్సరాల తరబడి జరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ పనులపై వెంటనే కలెక్టరు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనకాపల్లి జిల్లా కలెక్టరు మాట్లాడుతూ స్వయంగా పర్యవేక్షించి త్వరలో పూర్తి చేయిస్తానని హామి ఇచ్చారు.ఈ సమస్యపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, తాను స్వయంగా పనులను పర్యవేక్షించి, త్వరలో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. పనుల జాప్యాన్ని నివారించి, వాటిని వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.జడ్.పి.టి.సి. శెట్టి రోషణి ఎం.ఎల్.ఎ. మత్స్య లింగం మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా ఉపాధ్యాయులు రాలేదని తెలియజేసారు. అల్లూరి సీతారాజు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు సాయంత్రం లోపు పూర్తి చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. కోఆప్టెడ్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో రికార్డులు లేవని చెప్పుతున్నారని తెలియజేసారు. విధ్యా శాఖాధికారి వారు మాట్లాడుతూ పాఠశాలలో విధ్యార్థుల డేటా పూర్తి డిజిటలైజేషన్ జరిగినదని పూర్తి రికార్టులు వున్నవని తెలియజేసారు.సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణ మూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి, కె.రాజ్ కుమార్ ,జిల్లా పరిషత్ పరిపాలనాధికార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీ అదనపు గదుల నిర్మాణ శంకుస్థాపన



ఆముదాలవలస(విజయ సారథి):ఆముదాలవలస నియోజకవర్గంలోని బూర్జ మండలం లోని కొల్లివలస గ్రామంలో కేజీబీవీ జూనియర్ కాలేజీ అదనపు భవనాల నిర్మాణం కొరకు 2 కోట్ల 55 లక్షల రూపాయల నిధులతో శంకుస్థాపన కార్యక్రమం చేసిన ఆముదాలవలస శాసనసభ్యులు,రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు,మార్క్ఫెడ్ స్టేట్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, నియోజవర్గ పరిశీలకులు టి చంద్రశేఖర యాదవ్ పాల్గొన్నారు.

# శ్రీరామమూర్తి సేవలు అమోఘం

## కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం(విజయ సారథి):కళింగ జాతీయ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి సేవలు అమోఘమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం బూర్జ మండలం కొల్లివలస కస్తూరిబాగాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల వయసులో శ్రీరామమూర్తి చురుగ్గా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజాసేవలో నిమగ్నమవడం అందరికీ ఆదర్శం అన్నారు. తెలుగుదేశం పార్టీ కి శ్రీరామమూర్తి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమం



సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ శ్రీరామమూర్తి నిబద్ధత కలిగిన వ్యక్తిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బోనిల అప్పారావు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బి.వి.ఎస్.ఎన్.రాజు, వంశధార ప్రాజెక్ట్ చైర్మన్ అరవల రవీంద్ర, ఆమదాలవలస మార్కెట్ కమిటీ చైర్మన్ మజ్జి శ్రీరాములనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం రానున్న శాసనసభ కమిటీ

విశాఖపట్నం(విజయ సారథి):రాష్ట్ర పబ్లిక్ అండర్ టైకింగ్స్ శాసన సభా కమిటి ఈ నెల 11, 12 తేదీలలో విశాఖపట్నం రానున్నదని విశాఖపట్నం జిల్లా కలక్టర్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆముదాలవలస శాసన సభ్యులు కూన రవికుమార్ అధ్యక్షతన 8 మంది శాసన సభ్యులు, ముగ్గురు శాసన మండలి సభ్యులతో కూడిన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటి 11వ తేది ఉదయం గోదావరి ఎక్స్ప్రెస్ లో విశాఖపట్నం చేరుకొని సర్క్యూట్ హౌస్ కు వేళతారు. ఉదయం 10 గంటలకు కలక్టరేట్ లో విఎంఆర్డిఎ, ఎ.పి.మెడ్ టెక్ జోన్, ఎపిఐఐసి, ఎపి టూరిజం, శ్రీకాకుళం స్మార్ట్ సిటి కార్పొరేషన్, గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటి కార్పోరేషన్ ల యొక్క వార్షిక నివేదికలు ,కార్యకలాపాలపై అధికారులతో సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు నగరంలో క్షేత్ర పర్యటన చేస్తారు. 12వ తేది ఉదయం కలక్టరేట్ లో ఎపిఇపిడిసిఎల్, ఎఐసి-ఎఎంటిజెడ్ మెడి వాలీ ఇన్క్యుబేషన్ కౌన్సిల్, ఎపి గిరిజన కార్పొరేషన్, బయో వ్యాలీ ఇన్క్యుబేషన్ కౌన్సిల్, వైజాగ్ అపారల్ పార్క్, ఎపిఎస్ ఆర్టిసిల వార్షిక నివేదికల పై కార్యకలాపాలపై సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు నగరంలో క్షేత్ర పర్యటన చేస్తారని కలక్టర్ తెలిపారు. రాత్రి 10 గంటలకు విశాఖపట్నం నుండి తిరిగి విజయవాడ వెళ్తారు. కూన రవి కుమార్ అధ్యక్షతన వచ్చే ఈ కమిటీ లో శాసన సభ్యులు ఎ. ఆనందరావు, ఎన్. ఈశ్వర రావు, జి. సత్యనారాయణ, జి.శిరీష, వి. కుమార్ రాజా, ఆర్.వి.ఎస్.కె.కె. రంగా రావు, టి. శ్రావణ్ కుమార్, వి. వెంకట కృష్ణ ప్రసాద్, శాసన మండలి సభ్యులు బి. రామ్ గోపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ ఇసాక్ భాషా, డా. కుంభా రవిబాబు ఉన్నారు.

# గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందించడంలో దాతల సేవలు మరువలేనివి

అమరావతి(విజయ సారథి):గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందించడంలో దాతల సేవలు మరవలేనివని ప్రతినెల 9వ తేదీ గర్భిణీ స్త్రీలకు జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమని,గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుల సూచనలను పాటించాలని అమరావతి మండల పరిషత్ అధ్యక్షులు మేకల హనుమంతరావు అన్నారు.పెదకూరపాడులోని శ్రీకాకతీయ విద్యాసంస్థల సహకారముతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9వ తేదీ వివిధ వైద్య పరీక్షల నిమిత్తం వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలకు బుధవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డల కొరకు గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అమరావతి ప్రాంతంలో జనచైతన్య సమితి చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గోసుల సరస్వతి మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన నాటి నుండి డెలివరీ అయ్యేవరకు వైద్యుల సూచనల మేరకు మందులు బలవత్తరమైన ఆహారం తీసుకుంటేనే బిడ్డ పుట్టిన తర్వాత ఎటువంటి అనారోగ్య సమస్యలురావు అని అన్నారు. ప్రతిరోజు పాలు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలని పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు.జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ సృష్టిలో మాతృత్వానికి మించిన మాధుర్యం మరొకటి లేదని ఈ సృష్టికి మూలమే మాతృత్వం అని అలాంటి వారికి పౌష్టికాహారాన్ని అందించి సేవ చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్,బిజెపి సీనియర్ నాయకులు మద్ది దాత్రి నారాయణ,బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యులు నేరెళ్ల హనుమంతరావు,ఆసుపత్రి సిబ్బంది మేకల శ్రీనివాసరావు, షేక్ సంసుద్దీన్,గండు నవీన్, మేకల రామారావు అశోక్, జన చైతన్య సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.గర్భిణీ స్త్రీలకు పెరుగన్నం,కోడిగుడ్లు,డ్రై ఫ్రూట్స్ లడ్డులు,ఖర్జూర పండ్లు, మామిడికాయలు,బెల్లంతో తయారుచేసిన కొబ్బరి లౌజ్ పంపిణీ చేశారు.



# గత వైసీపీ పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసం ప్రజలు గమనించాలి

## రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుంది

## ఎంపీ బస్తిపాటి నాగరాజు



ఆలూరు(విజయ సారథి):గత వైసీపీ పాలనకు కూటమి ప్రభుత్వం పాలన కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆలూరు నియోజకవర్గంలోని హ్వాళగుంద మండల కేంద్రంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఎంపీ నాగరాజు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వివరించారు.అంతకు ముందు ఎస్బి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసి చూపించిందన్నారు.ఇక ఈ నాలుగేళ్లలో ఆలూరులో వేదవతి ప్రాజెక్టును నిర్మించడంతో పాటు కర్నూలు టూ బళ్ళారి జాతీయ రహదారిని నిర్మిస్తామన్నారు.ఇక రాష్ట్రం కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందన్న ఎంపీ.సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఆలూరు పరిశీలకులు ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు, అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు వెంకట శివుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ , హ్వాళగుంద మండల అధ్యక్షుడు తిప్పయ్య, మాజీ అధ్యక్షుడు శేషగిరి , మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఖ

# పార్టీ ఉనికి కోసం జగన్ పాట్లు

## దండుపాళ్యం బ్యాచ్‌తో బంగారు పాళ్యం పర్యటన

## టీడీపీ నేత ఆర్ శ్రీనివాసరెడ్డి మండిపాటు

కడప,జూలై9: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వైఎస్ జగన్ బంగారుపాళ్యం పర్యటనపై ఆర్ శ్రీనివాసరెడ్డి బుధవారం కడపలో విలేకర్లతో మాట్లాడుతూ.. జగన్ దండుపాళ్యం లాగా బంగారుపాళ్యం వెళ్లారని అభివర్ణించారు. పార్టీ ఉనికి కోసం వైఎస్ జగన్ పాట్లు పడుతున్నారని మండిపడ్డారు. గత వైసిపీ ప్రభుత్వంలో మామిడి రైతులు నష్టపోతే ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వైఎస్ జగన్ పట్టించుకో లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం కేవలం పరామర్శల పేరుతో ఆయన విధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కూటమి ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్ళామన్నారు. కూటమి పాలనను ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. కడప వైసిపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా రఫ్ఫా రఫ్ఫా అని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పి.. 11 సీట్లకు పరిమితం చేశారని వివరించారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com